ప్రాణాలు పోతున్నా... ప్రజారక్షణే లక్ష్యం

- పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- జిల్లాలో ఈ ఏడాది అమరులైన 10 మంది పోలీసులు
- రేపు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

వివరాలు 6లో..

నేడే దీపావళి

- బాణసంచా కొనుగోళ్లతో జనం బిజీ బిజీ
- గతేడాది కంటే 20శాతం ధరల పెరుగుదల
- ఈసారి వరుణుడి రాకతో పేలని టపాకాయలు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చీకటిపై వెలుగు విజయాన్ని సూచించే పండుగదీపావళి. ఈ పం డుగను ప్రజలంతా సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను బాణసంచా కొనుగోళ్లలో జనం బిజీబిజీగా ఉన్నారు నరకాసురుడిపై శ్రీకృష్ణుడు విజయం సాధించిన సందర్భంగా దీపావళి జరుపుకుంటారు. అలాగే త్రేతాయుగంలో శ్రీరాముడు 14 ఏళ్ల అరణ్యవాసం అనంతరం అయోధ్యకు వచ్చిన సందర్భంగా అయోధ్యవాసులంతా నగరంలో దీపాలు వెలిగించి

మిగతా 6లో..



నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద బాణసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

భారీ వర్షం



నెల్లూరు : మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జలమయమైన తల్పగిరి కాలనీ


- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లోతట్టు ప్రాంతాల జలమయం
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- వాయుగుండంగా మారే అవకాశం
- 23 నుంచి భారీ వర్షాలు : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈశా న్య రుతుపవనాల ప్రభావంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాం తాలు నీటమునిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈశాన్య రుతుపవనాలు జిల్లాలో ప్రవేశించడంతో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నారు. సోమవారం దీపావళి కావటంతో టపాసులు కొనుగోలు చేయడానికి వచ్చినవారు వర్షంలో ఇబ్బందులు పడ్డారు. కాగా జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 49.1 మి.మీగా నమోదైంది. అత్యధికంగా సంగంలో 140.6 మి.మీ, అత్యల్పంగా సైదాపురంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నెల్లూరు అర్బన్‌లో 93.4, కోవూరులో 96.2, బోగోలులో 93.2, నెల్లూరు రూరల్‌లో 90.4, ఆత్మకూరులో 82.2, కలువాయిలో 80.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

● బంగాళాఖాతంలో అల్పపీడనం : కలెక్టర్

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది మంగళవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో జిల్లాలో ఈనెల 23 నుంచి 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తీర ప్రాంతాల్లో గాలి వేగం 45 నుంచి 65 కి.మీ వరకు ఉండవచ్చని వివరించారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, సముద్రంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా ఈనెల 21లోగా తీరానికి చేరుకోవాలని కోరారు. వాతావరణ శాఖ సూచన మేరకు ఈనెల 21 నుంచి 23 తేదీల్లో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

సోమశిలకు వరద ముప్పు



సోమశిల నుంచి దిగువకు వదులుతున్న వరద నీరు

- పెన్నా క్యాచ్‌మెంట్‌లో విస్తారంగా వర్షాలు
- జలాశయానికి క్రమేణా పెరుగుతున్న వరద
- 4 నుంచి 5 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం
- గేట్ల దుస్థితిపై ఆందోళన
- తీరప్రాంత గ్రామాల ప్రజల అప్రమత్తం

అనంతసాగరం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. పెన్నాతీర ప్రాంతాల్లో కురుస్తున వర్షాల కారణంగా, రానున్న 24 గంటల్లో నాలుగు నుంచి 5 లక్షల క్యూసెక్కులు సోమశిల వచ్చే సూచనలు ఉన్నట్లు ఇంజనీర్లు హెచ్చరికలు జారీచేశారు. అదే మొత్తంలో కింద కు వదిలే అవకాశం ఉన్నందున, తీర గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాలు జారీ చేశారు.

● గేట్ల దుస్థితిపై ఆందోళన

సోమశిల క్రస్ట్‌గేట్ల దుస్థితిపై అ టు అధికారులు, ఇటు ప్రజలు ఆం దోళన చెందుతున్నారు. కొన్నిగేట్లు మొరాయిస్తుండగా, మరి కొన్నింటికి రోప్స్ దెబ్బతిన్నాయి. 4 నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరద వస్తే, దిగువకు అంత ప్రవాహాన్ని వదలాంటే మొత్తం గేట్లు ఎత్తాలి. కాగా ప్రాజె క్టు పరిధిలో 11,12 గేట్లు మాత్రం రోప్‌ల డ్యామేజ్ వల్ల పైకి ఎత్తలేని పరిస్థితి నెలకొంది.

● సోమశిలలో 73.940 టీఎంసీలు

సోమశిల జలాశయానికి శనివారం 15,064 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా

మిగతా 6లో..

నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ!

- హస్త కళాకారులకు ఉచిత తర్ఫీదు
- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు



చెక్కనగిషీ కేంద్రంలో వస్తువులు తయారు చేస్తున్న కళాకారులు

ఉదయగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హస్త కళాకారులు వస్తువుల తయారీలో నైపుణ్యత సాధించేందుకు, స్వయం ఉపాధిని పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ఉచిత శిక్షణను అందిస్తున్నది. సమగ్ర నైపుణ్య అప్‌గ్రేడేషన్ కార్యక్రమంలో భాగంగా హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ వారు సంయుక్తంగా ఉదయగిరిలోని దిలావర్ భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రంలో కళాకారులకు ఈ శిక్షణ అందిస్తోంది. భవిష్యత్తులో స్వశక్తితో ఉపాధిని పొందడమే లక్ష్యంగా, మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని వస్తువుల తయారీలో నైపుణ్యత సాధిస్తున్నారు.

● 320 మంది హస్తకళాకారులు

ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో 320 మంది మహిళా హస్త కళాకారులు ఉన్నారు. వీరు కొయ్యతో 150 రకాల వస్తువులను తయారు చేస్తారు. వీరు తయారు చేసిన వస్తువులను కేంద్రం నిర్వాహకులు ప్రపంచ, దేశ, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించే ప్రదర్శనల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతోపాటు వస్తువుల విక్రయం ద్వారా వచ్చిన నగదుతో కళాకారులు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు.

● ఐదు నెలలపాటు శిక్షణ

చెక్కనగిషీ కేంద్రంలో తొలి విడతగా ఎంపిక చేసిన 30 మంది హస్త కళాకారులకు ఐదు నెలలపాటు టెక్నికల్, డిజైన్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ నిర్వహణకు డెవలప్‌మెంట్ కమిషనర్ న్యూఢిల్లీ వారు రూ.14 లక్షలు మంజూరు చేశారు. శిక్షణ పొందుతున్న మహిళలకు భృతి సైతం అందజేస్తున్నారు. అలాగే కళాకారులు తయారు చేసిన వస్తువుల మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రభుత్వ అందించే ఉచిత శిక్షణ తమకు ఎంతో ఉపయుక్తంగా ఉందని పలువురు మహిళలు పేర్కొన్నారు.

జర్మన్ నేర్పి ఉపాధి చూపి..

- ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు స్పెషల్ ట్రైనింగ్
- అనంతరం విదేశాల్లో ఉద్యోగావకాశాల కల్పన
- జిల్లాలో 900 మందికి తర్ఫీదు

నెల్లూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణ నేపథ్యంలో అన్నీ రంగాల్లోనూ పోటీ పెరిగింది. ఈ క్రమంలో పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అకడమిక్ ప్రయోగాలకు సంబంధించి పరిజ్ఞానం ఉన్నా, విదేశాల్లో ఉద్యోగాలు దక్కించుకోవాలంటే భాషపై పట్టు ఉండాలన్న లక్ష్యంతో విద్యార్థులకు శిక్షణ ప్రారంభించింది. ప్రధానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో(ఐటీఐ) వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న వారికి విదేశీ భాషలపై శిక్షణ అందిస్తుండంతో వారు ఆసక్తిగా హాజరవుతున్నారు.

● సర్వసేతు ప్రాజెక్టులో భాగంగా...

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్వసేతు ప్రాజెక్టులో భాగంగా ఐటీఐ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ ఇస్తున్నారు. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలుత రెండు జిల్లాల్లో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి స్పందన బాగా ఉంది. దీంతో అన్నీ జిల్లాల్లో ఈ విద్యాసంవత్సరం జర్మన్‌భాష నేర్చుకునేలా ఏర్పాట్లు చేశారు. వారంలో రెండు రోజులు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 6 ప్రభుత్వ ఐటీఐల్లో చదువుతున్న 900 మందికి సోమ, బుధవారాల్లో గంటపాటు తరగతులు నిర్వహిస్తున్నారు. అన్నీ ట్రేడ్‌ల వారికి ఉచితంగా జర్మన్‌భాష నేర్పుతుండడంతో విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఆరునెలలు జరిగే ఈ శిక్షణలో విద్యార్థులకు నాలుగు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణత సాధిస్తేనే భవిష్యత్‌లో విదేశాల్లో ఉద్యోగానికి వెళ్లే అర్హత లభిస్తుంది. తొలుత ఏ-1, ఏ-2 స్థాయిల్లో ఉత్తీర్ణులైన తరువాత బీ-1, బీ-2 స్థాయిలో ఇచ్చే శిక్షణకు అర్హత సాధిస్తారు. వాటిలోనూ పాసైతే ఐటీఐ ప్రామాణికంగా జర్మనీలో నెలకు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వేతనంతో ఉద్యోగం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



దీపావళి ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి

● మంత్రులతోపాటు ప్రముఖుల శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని దాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బాణసంచాయే కాక వెలుగు పువ్వులు నింపే పర్యావరణ రహిత దీపావళి జరుపుకోవాలని ఆనం కోరారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి, సంతోషాల వెలుగులు ప్రసరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా పిల్లలంతా టపాకాయలను తల్లిదండ్రుల సమక్షంలో కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలని సూచించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఇంటిలో సిరిసంపదలు నెలకొనాలని కోరారు. అలాగే జిల్లా ప్రజలకు ఇన్‌చార్జ్ మంత్రి ఎస్ ఎండీ.ఫరూఖ్ దీపావళి శుభాకాంక్షలను తెలిపారు. బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలందరికీ దీపావళి సంతోషాల సంబరం కావాలని దేవ

నేడు దీపావళి

(5వ పేజీ తరువాయి)

స్వాగతం పలుకుతారు. బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మన సంస్కృతికి ప్రతిబింబంగా కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా వేడుకగా ఈ పర్వదినాన్ని నిర్వహించుకుంటారు. ఆబాలగోపాలం జిల్లాలో దీపావళి కోసం నూతన వస్త్రాలు, పిండి వంటలు, గృహాలంకరణలను సిద్ధం చేసుకున్నారు.



నరక చతుర్థశి సందర్భంగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఓ ఇంటి ముందు వెలిగించిన దీపాలు

● ఈరోజు చేయాల్సినవి..

● దీపావళి రోజున (నేడు) గృహాలను శుభ్రపరచుకోవడం, రంగులతో అలంకరించడం

● ఇంటాబయటా దీపాలు వెలిగించి, సుందరంగా అలంకరించడం.

● ఈరోజు సాయంత్రం గృహాలు, వ్యాపార దుకాణాల్లో లక్ష్మీదేవి పూజ చేయడం

● ఉదయం నూతన వస్త్రాలు ధరించడం, సాయంత్రం బాణసంచా కాల్చడం, మిఠాయిలు తినడం

బాణసంచా ధరలు పైపైకి..

దీపావళి అంటేనే టపాకాయల మోత. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.4కోట్లకుపైగా వ్యాపారం జరుగుతుంది. స్థానికంగా తయారీతోపాటు శివకాశీ నుంచి బాణసంచాను జిల్లాకు దిగుమతి చేసుకుంటారు. ఈ పండుక్కకు 30రోజులకు ముందుగానే వ్యాపారం ప్రారంభమవుతుంది.కాగా ఈ ఏడాది బాణసంచా ధరలు తారాజువ్వాల్లా పైపైకి వెళ్లాయి. గత ఏడాది కంటే ఈసారి ధరలు 20శాతం పెరిగాయి. గతంలో ఓ కుటుంబం రూ.500లకు టపాకాయలు కొంటే రెండు, మూడు రోజులు కాల్చేవారు. ప్రస్తుతం రూ.3వేలకు కొన్నా అసంతృప్తిగానే ఉంది. అయితే మూడు రోజులుగా జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఏదిఏమైనా ఉన్నంతలో ప్రజలంతా ఆనందంగా పండుగను జరుపుకోనున్నారు.

సోమశిలకు వరద ముప్పు

(5వ పేజీ తరువాయి)

ఆదివారం ఉదయానికి 15,827, మధ్యాహ్నానికి 23 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. సోమ, మంగళవారాల్లో ప్రవాహం భారీగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. డ్యాంలో ప్రస్తుతం 73.940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా మరో 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● కండలేరులో 59.930 టీఎంసీలు

రాపూరు : కండలేరు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.930 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2220 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 3050 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

నీటి మళ్లింపుతో రోడ్డుపై ప్రవాహం

● పలు గ్రామాలకు రాకపోకలు బంద్

కలువాయి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కండలేరు నీటి మట్టం 60టీఎంసీలకు చేరడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సోమశిల-కండలేరు కాలువ ద్వారా వస్తున్న నీటిని పూర్తిగా కండలేరుకు చేరకుండా కొంతమేరకు పక్కకు మళ్లించారు. దీంతో పలు చెరువులు నిండి ఆనీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో మండలంలోని వెదనపర్తి, చిన్నగోపవరం, కేసీ గోపవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడె రోజులుగా వర్షాలు కురుస్తుండటం, సోమశిల నుంచి సుమారు 3వేల క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుండటంతో కండలేరు డ్యాంలో నీరు అధికమయ్యాయి. దీంతో ఇబ్బందులు తలెత్తకుండా సోమశిల-కండలేరు కాలువ 43కి.మీ వద్ద నున్న గేట్లు ఎత్తి చవటపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించారు. కండలేరు కాలువలో 2100 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.



కలువాయి గోపవరం సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో ఆగిపోయిన వాహనాలు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించటం శుభపరిణామం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించటం శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి అన్నారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్లకు ఒక డీఏ ప్రకటించటం హర్షణీయమన్నారు. 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బీ.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపతి

ప్రాణాలు పోతున్నా... ప్రజారక్షణే లక్ష్యం

● పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం ● జిల్లాలో ఈ ఏడాది అమరులైన పదిమంది పోలీసులు ● రేపు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రటి ఎండలోనూ... జోరు వానలోనూ... వణికించే చలిలోనూ... రాత్రింబవళ్లు తేడాలేకుండా 24గంటలూ ప్రజల కోసం బతికేవారే పోలీసులు. విధి నిర్వహణలో కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, శాంతిభద్రతలే లక్ష్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయనిపోలీసుల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ఏడాడి 10 మంది పోలీసులు విధులు నిర్వహిస్తూ ప్రాణాలు విడిచారు. ఈనెల 21న (మంగళవారం) పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● పవిత్రస్థలం హాట్ స్ప్రింగ్

భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్‌చిన్ ప్రాంతంలో 16వేల అడుగుల ఎత్తున, రక్తం గడ్డకట్టే మంచుపర్వతాల మధ్యన ఉన్న (హాట్ స్ప్రింగ్) వేడినీటి బుగ్గ అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. మిలటరీ ఎత్తుగడలకు చైనా సరిహద్దుల్లోని భారత భూభాగాలైన లడక్, సియాచిన్ ప్రాంతాలు కీలకమైనవి. సరిహద్దు భద్రతాదళం, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీసు వంటి ప్రత్యేక భద్రతాదళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే మహత్తర బాధ్యతను కేంద్రం రిజర్వ్ పోలీసు ఫోర్సు(సీఆర్‌పీఎఫ్) నిర్వహించేది. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో 21మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తుండగా చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్‌పీఎఫ్ దళం హాట్‌స్ప్రింగ్ ప్రాంతంలో ఎదురొడ్డి పోరాడింది. ఆ పోరాటంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసు వీరుల రక్తంతో తడిచిన హాట్‌స్ప్రింగ్స్ నెత్తుటిబుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపుదిద్దుకుంది. దీంతో ప్రతి ఏటా అన్నీ రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్రస్థలాన్ని సందర్శించి నివాళులర్పించడం ఆనవాయితీ.

● జిల్లాలో అమరవీరులెందరో..

జిల్లాలో విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులెందరో ఉన్నారు. 1981లో అరెస్టు వారెంట్ జారీ చేయడానికి వెళ్లిన రెండో పట్టణ కానిస్టేబుల్ రామయ్యను ఓ రౌడీషీటర్ కత్తితో పొడిచి చంపాడు. 1985లో తడ ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగేశ్వరరావును అక్రమ ధాన్యం రవాణా స్మగ్లర్లు లారీలతో ఢీకొట్టి చంపారు. 1991లో పోలీసు వ్యాన్ డ్రైవర్ వెంకటేశ్వర్లు తుపాకీ మిస్‌ఫైర్ అయ్యి మరణించారు. 1997లో వరికుంటపాడు ఎస్‌ఐ వెంకటేశ్వరరావును కొన్ని అసాంఘిక శక్తులు పోలీస్‌స్టేషన్‌లోనే గొడ్డళ్లతో నరికి చంపారు. 1994లో వెంకటగిరి బెటాలియన్‌కు చెందిన ఐదుగురు కానిస్టేబుళ్లు ఎన్నికల విధులు నిర్వహిస్తూ వరంగల్ జిల్లాలో నక్సలైట్ల మందుపాతరకు బలయ్యారు. 2006లో ప్రభుత్వ నగదును హైదరాబాద్‌లో అప్పగించి తిరుగు ప్రయాణంలో నల్గొండ జిల్లా చింతపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుళ్లు రామచంద్రయ్య, అరుణ్‌కుమార్, యుగంధర్, షరీఫ్, శ్రీనివాసులు ప్రాణాలు విడిచారు. 2008లో బలిమెల వద్ద జరిగిన మావోయిస్టుల కాల్పుల్లో కలువాయికి చెందిన కేశవులు అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. 2010లో గుడ్లూరు పోలీసులు బిట్రగుంట దొంగలను తరుముతూ వస్తూ కావలి వద్ద ప్రమాదానికి గురై ముగ్గురు పోలీసులు సజీవదహనమయ్యారు. ఈ ఏడాది ఏఎస్పీ డ్రైవర్ రమేష్ గన్ మిస్‌ఫైర్ అయ్యి మృతి చెందాడు.



● ఈఏడాది 10 మంది అమరులు

గత అక్టోబరు నుంచి ఈఏడాది అక్టోబరు వరకు వివిధ కారణాలతో జిల్లాలో విధులు నిర్వహిస్తూ 10 మంది పోలీసులు మృతి చెందారు. నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే యూ.శివకుమార్, ఏఎస్ పేట స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే వై రమేష్, నవాబుపేట స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే ఎం. నాగయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎం. చలపతి, నవాబుపేట స్టేషన్ ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ కే. లక్ష్మినారాయణ, ఉలవపాడుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుల్ డీ. రాజశేఖర్, కావలి రూరల్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎస్ నాగరమేష్, నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్ అంకయ్య, నెల్లూరు డీఆర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసే కె రమేష్‌బాబు, నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ జీ. శివకుమార్‌లో మృతి చెందారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఈ నెల 21న పోలీసు కవాత్తు మైదానంలో ఘనంగా నివాళులు అర్పించనుంది.

భానుచందర్ అకాల మరణం.. దగదర్తిలో విషాదం

● మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించిన పలువురు నేతలు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలంలో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచిన మాలేపాటి కుటుంబంలో యువ కిరణం అస్తమించడంతో చీకటి కమ్మినట్లయింది. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు కుమారుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు (38) శనివారం రాత్రి అకాల మరణం చెందాడు. భానుచందర్ మృతి వార్త తెలియడంతో స్థానిక టీడీపీ నేతలు, పలుపార్టీల నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పేదల పాలిట పెద్దదిక్కుగా నిలిచే మాలేపాటి కుటుంబం నుంచి ప్రజాసేవలో ఎప్పుడూ ముందు వరుసలో ఉండే టీడీపీ యువనేత భానుచందర్ అనతికాలంలోనే ఎనలేని ప్రేమాభిమానాలు సంపాదించుకున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో బాబాయి మాలేపాటి సుబ్బానాయుడుకు కుడిభుజంగా ఉండేవారు. నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లోనే కాకుండా పార్టీ రాష్ట్ర నాయకులచే చిన్న వయసులోనే భానుచందర్ ప్రశంసలందుకున్నారు. ఇటీవల బాబాయి సుబ్బానాయుడు అనారోగ్యానికి గురవడం భానుచందర్‌ను మానసికంగా కుంగదీసిందని పెద్దలు చెబుతున్నారు. భానుచందర్ మృతదేహాన్ని దగదర్తిలోని స్వగృహానికి తీసుకొస్తున్నారని సమాచారం అందడంతో మాలేపాటి అభిమానులు, టీడీపీ పార్టీనేతలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యానాయుడు, బీద గిరిధర్, బోగోలు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, బీజేపీ మండల కన్వీనర్ వీరాల శ్రీనివాసయాదవ్, కాంద్ర సతీశ్ నాయుడు తదితరులు భానుచందర్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల నుంచి టీడీపీ, బీజేపీ నేతలు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రవీంద్రనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కాకర్ల సురేష్



భానుచందర్ నాయుడు(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మాజీ మిలటరీ ఉద్యోగి మృతి

కావలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మోటారు బైకుపై వెళతుండగా గేదె అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు మాజీ మిలటరీ ఉద్యోగి గోసాల కోటేశ్వరరావు(56) మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి కావలి మండలం కొత్తపల్లి సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సర్వాయపాలెం పంచాయతీ తాగేటివారిపాలెంకు చెందిన కోటేశ్వరరావు మోటారు బైకుపై లింగసముద్రం మండలం ముత్యాలపాడుకు వెళ్తుండగా ఒక్కసారిగా గేదె అడ్డురావటంతో బైక అదుపుతప్పి కిందపడడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్నకుమారుడు మణికంఠ వివాహం ఈ నెల 11వ తేదీన జరిగింది. ఇంట్లో శుభకార్యం కూడా ముగియకముందే రోడ్డు ప్రమాదంలో కోటేశ్వరరావు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రూరల్ ఎస్‌ఐ బాజీబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరురోడ్డు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మారుబోయిన మనోజ్‌కుమార్(32) ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం ముంగమూరు పంచాయతీకి చెందిన మనోజ్ దామవరంలోని బీఎంఆర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉదయం బైకుపై స్వగ్రామానికి వస్తుండగా ఫ్లైఓవర్ వద్ద మలుపులో అదుపుతప్పి కింద పడడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అల్లూరు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జ్ ఎక్కే మలుపు రహదారి సరిగా లేకపోవండతో అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రదేశంలో పలువురు మృతి చెందారు. అయినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. దాదాపు ఎనిమిదేళ్ళ క్రితం పనుల నిమిత్తం మూసేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి విషయం పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వీవోఏ ఆత్మహత్యాయత్నం

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగు సీసీ లక్ష్మయ్య, కొంతమంది పొదుపు మహిళలు, స్థానికంగా ఉండే ఓ విలేఖరి తన తప్పు లేకపోయినా మానసికంగా వేధిస్తున్నారని వెలుగు వీవోఏ సెల్ఫీ వీడియో చిత్రీకరిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నందిపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిపాడు గ్రామంలోని ఓ పొదుపు గ్రూపునకు చెందిన కొంత మంది మహిళలు పొదుపు నగదు బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల వెలుగు కార్యాలయంలో అధికారులు ఆ విషయమై విచారణ చేపట్టి ఎలాంటి స్వాహా చేయలేదని నిర్ధారించారన్నారు. అయితే సీసీ లక్ష్మయ్య, ఆ పొదుపు మహిళలు, స్థానికంగా ఉండే ఓ విలేఖరి మరలా తనపై అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు లేనిపోని నిందారోపణలు వేస్తున్నారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన రజియా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, తనను వేధింపులకు గురిచేసిన వారి పేర్లు, వివరాలు సెల్ఫీ వీడియో ద్వారా వెల్లడిస్తూ ఉరి వేసుకునేందుకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను రక్షించారు. సెల్ఫీ వీడియో బయటకు రావడంతో వెంటనే స్పందించిన ఎస్‌ఐ ఆదిలక్ష్మి హుటాహుటిన పోలీసులను సంఘటనా స్థలానికి పంపి ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సంబంధిత అధికారులను విచారించిన అనంతరం కేసు నమోదు చేస్తామని ఆమె ఈ సందర్భంగా వివరించారు.

మహిమాన్వితం కార్తీకం !

● 22 మాసం నుంచి ప్రారంభం ● శివకేశవులకు ప్రీతిపాత్రం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగు మాసాల్లో కార్తీకం మహిమాన్వితమైనదని స్కంద పురాణంలో పేర్కొన్నారు. ఈనెల శివకేశవులకు ప్రీతిపాత్రమైంది. ఈ మాసమంతా పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలతో ప్రజలు భక్తి పారవశ్యంతో మునిగిపోతారు.

'న కార్తీక నమో మాసః
న దేవం కేశవాత్పరం
న చ వేద సమం శాస్త్రం
న తీర్థం గంగా యాస్థమమ్



ఈ శ్లోకం అర్థం ఏమిటంటే.. కార్తీకమాసం వంటి మాసం లేదు. మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడు. వేదంతో సమానమైన శాస్త్రంలేదు. గంగతో సమానమైన తీర్థంలేదని... కార్తీకమాసమంతా పండుగలే. కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాల్లో రుద్రాభిషేకం, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు జరుగుతాయి. ఈ మాసంలో నదులు, చెరువుల్లో దీపాలను వదలడం వల్ల లక్ష్మీదేవీ అనుగ్రహం లభిస్తుంది.నదులు, చెరువులు, ఆలయాలు, లేదా ఇంట్లో తులసికోట వద్ద ప్రతీరోజు దీప దానం చేస్తారు. ఇందువల్ల జీవితంలో చీకట్లు తొలగి లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి, సిరిసంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవాలు నిర్వహిస్తారు. కార్తీకమాసం ఈనెల 22 నుంచి ప్రారంభమవుతోంది. 23న బలిపాడ్యమి, యమద్వితీయ, భగినీ హస్తభోజనం జరుపుకుంటారు. 25న నాగుల చవితి , నవంబరు 1 కార్తీక శుద్ధఏకాదశి, 2న చిలుక ద్వాదశి, తులసీ కల్యాణం, 4న వైకుంఠ చతుర్థశి, 5న కార్తీక పౌర్ణమి జరుపుకోనున్నారు. ఈ ఏడాది కార్తీకలో 4 సోమవారాలు వచ్చాయి. ఈనెల 22 నుంచి శివారాధనలకు శ్రీకారం చుడుతారు. ప్రాతఃకాలస్నానాలతో శివపూజలు, కార్తీక దీపారాధనలు ప్రారంభిస్తారు.

కమనీయం రంగనాథ కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. కేసీ దాస్ స్మారక సేవా సంస్థ అనుబంధ సంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ధర్మాచార్య బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపారు. అనంతరం ఆయన కల్యాణ మహోత్సవం విశిష్టత, నిత్యపూజా విధానంపై ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తులకు పుష్పయాగం చేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ఖండవల్లి రాధాకృష్ణ, పాటూరు రవికిరణ్, వేములపాటి నవీన్, పీ శివప్రసాద్, పోరూరి శ్రీనివాసరావు వ్యవహరించారు.



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం జరిపిస్తున్న ధర్మాచార్యులు శ్రీరామచంద్రమూర్తి

కనుల పండువగా ప్రాకారోత్సవం

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం నరక చతుర్దశి, లయ ప్రాకారోత్సవాలు జరిగాయి. తొలుత రంగనాథస్వామికి గోపురోత్సవం, అనంతరం నరకాసుర వధ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. దీపావళి సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం రంగనాథస్వామికి తిరుమంజనం, సాయంత్రం 4.30 గంటలకు పేట ఉత్సవం జరుగుతాయన్నారు.

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికకు సంబంధించిన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. సబ్‌జూనియర్ ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో జి.వెంకట లోకేష్, ఎన్.శశాంక్, జి.మహిధర్, డి.శశిధర్, వి.మోక్షితసాయి, ఎ.సాత్విక్‌లు, బాలికల విభాగంలో వై.దీత్యా చండిక, ఎ.ప్రీతి, ఎ.ఆలియా, ఎన్.షణ్ముఖ, ఎం.కౌషికి, కె.తన్వి సాయి అశ్విని ఎంపికయ్యారు. సబ్‌జూనియర్ రికర్వ్ రౌండ్ బాలుర విభాగంలో కె.తరుణీష్‌జాత్యా, పి.రాజేష్, కె.చరిత్, సీహెచ్.అక్షయ్ మహదేవ్, ఎస్‌కె.కౌషిద్ అహ్మద్, డి.చరణ్, బాలికల విభాగంలో డి.నిష్విత ఎంపికయ్యారు. కాంపౌండ్ రౌండ్ బాలుర విభాగంలో టి.రమేష్‌కుమార్, బి.వికాస్, ఎం.చైతన్య విష్ణు ఎంపికయ్యారు. ఎంపిక చేసిన జట్లు విజయవాడలో నవంబరు 1 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అదుపుతప్పి మినీ లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్డుపాడు సమీపాన 565 జాతీయ రహదారిపై పిల్లాపేరు వంతెన వద్ద మినీ లారీ బోల్తాపడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కర్నూల్ నుంచి ఒడిస్సాకు టమోటా లోడుతో వెళుతున్న మినీ లారీ పిల్లాపేరు వంతెన సమీపానికి రాగానే అదుపుతప్పి హైవే లైనింగ్ వాల్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది అంబులెన్స్‌లో అతన్ని చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు.

భారీ వర్షానికి విరిగి పడిన కొండ చరియలు

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం కొండ మధ్య వెళ్లే ముంబాయి జాతీయ రహదారిపై శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండ చరియలు విరిగి పడ్డాయి. అయితే ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రాజేష్ వెంటనే వెళ్లి బండరాళ్లను రోడ్డు పక్కకు తరలించారు. వర్షాల సమయంలో కొండ మధ్య వెళ్లేటప్పుడు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560



కార్తీక మాసోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరం లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగే కార్తీక మాసం వేడుకల కరపత్రాలను ఆదివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 21 నుంచి నవంబరు 18వతేదీ వరకు కార్తీక మాసోత్సవాలు జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.



ఆర్టీసీ ప్రధాన బస్టాండులో అవుట్ సోర్సింగ్ కార్మికులకు దుస్తులు అందిస్తున్న జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, డీపీటీవో షమీమ్ తదితరులు

అవుట్ సోర్సింగ్ కార్మికులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఆదివారం నగరంలోని ప్రధాన బస్టాండులో జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి రెయిన్ కోట్లు, యూనిఫాం, దుప్పట్లు పంపిణీ చేశారు. జోనల్ చైర్మన్ మాట్లాడుతూ కష్టకాలంలో కూడా ఆర్టీసీకి సేవలు అందిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు సంస్థకు బలమన్నారు. వారి సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షమీమ్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



పరిశ్రమలకు భూములు కేటాయించడం దారుణం

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి పంచాయతీల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించడం దారుణమని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయా పంచాయతీల రైతులతో కుర్రపల్లి బీసీ కాలనీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మంజూరుచేసిన భూములను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించడం అన్యాయమని, అధికారులు తక్షణం స్పందించి ఆ భూముల కేటాయింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



డీఏ విడుదల హామీ హర్షణీయం

నెల్లూరు(విద్య/హరనాథపురం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు డీఏ విడుదలకు హామీ ఇవ్వడం హర్షణీయమని ఎన్‌టీఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ తిరుమలయ్య, సీహెచ్ చెన్నయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్క డీఏ ఇచ్చినా అత్యంత గౌరవంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం కనీసం చర్చలు జరిపిన సందర్భాలు కూడా లేవని, ప్రస్తుత ప్రభుత్వం తమకు గౌరవమిచ్చి చర్చలు జరిపి రాష్ట్ర పరిస్థితిని వివరించి డీఏ విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు.

రాష్ట్రం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా, ఉద్యోగులు, పెన్షనర్ల విజ్ఞప్తిని మన్నించి వారికి రావాల్సిన డీఏలో ఒక వాయిదా చెల్లించేందుకు అంగీకరించినందుకు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపింది. అలాగే, బకాయిలన్నీ కూడా చెల్లించాలని కోరింది. సీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.









ఆస్టియో పోరోసిస్..

ఎముకలు గుల్లే..!

- బోలు ఎముకల వ్యాధిపై అప్రమత్తత అవసరం
- లేకపోతే మంచానికే పరిమితం
- మహిళలూ.. తస్మాత్ జాగ్రత్త!
- జిల్లాలో 2.30 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
- నేడు ప్రపంచ బోలు ఎముకల నివారణ దినం



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్టియో పోరోసిస్.. ఇది ఎముకలను బోలుగా మార్చే వ్యాధి. దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు. బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోవడంతో శరీరంలో శక్తి క్షీణించడమే కాకుండా ఎముకల పటుత్వం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువగా వృద్ధులకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువకుల్లోనూ కనిపిస్తోంది. ప్రత్యేకించి మహిళలలో ఆ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ వ్యాధి వల్ల ఒక్కసారిగా దీర్ఘకాలిక వ్యాధులకు లోనయ్యే ప్రమాదం ఉంది. ప్రత్యేకించి రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో ఈస్ట్రోజన్ శాతం తగ్గి ఎముకల్లో కాల్షియం క్షీణించి ఆస్టియో పోరోసిస్ వ్యాధికి గురవుతున్నారు. ఒక్కోసారి ఈ వ్యాధి మరణాలకు కూడా దారి తీస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో 2.30 లక్షల మంది వ్యాధిగ్రస్థులు

జిల్లావ్యాప్తంగా వృద్ధులు 5 లక్షల మందికిపైగా ఉండగా వారిలో 1.50 లక్షల మంది బోలు ఎముకుల వ్యాధికి గురైనట్లు గణాంకాలు చెబుతున్నా యి. మరో 80వేల మంది మహిళలు, యువకులు ఈ వ్యాధితో బాధప డుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, రాపూరు తదితర మండలాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో సైతం ఆధునిక పనిముట్లు అందుబాటులోకి రావటంతో శారీరక శ్రమ తగ్గింది. బలవర్ధకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీనికితోడు అవగాహన లేమితో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో కొందరు మంచానికే పరిమితం అవుతున్నారు.

మహిళలూ.. జాగత్త

ఆస్టియో పోరోసిస్ వ్యాధి ప్రభావం మహిళల్లో ఎక్కువగా ఉంది. 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు ఈ వ్యాధికి గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. విటమిన్ డీ లోపం, కాల్షియం తక్కువగా తీసుకోవడం, రుతుస్రాతం తొందరగా ఆగిపోవడం, జన్మపరమైన కారణాలు, రోగ నిర్ధారణ నియమాలు లేకపోవడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాలతో మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. థైరాయిడ్ బాధితుల్లో ఆ ప్రభావం ఎముకల సాంద్రతపై పడుతోంది. సూర్యకాంతిలో గడిపే సమయం తక్కువగా ఉండటం, కాలుష్యం పెరిగిపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం దీనికి ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

ఆధునిక వైద్య విధానాలు



అస్టియో పోరోసిస్ వ్యాధి ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్లపైబడ్డ వారు తప్పనిసరిగా ఎముకల పరీక్ష చేయించుకోవాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి. వ్యాధిపై నిర్లక్ష్యం వహించరాదు. వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్సలు చేయించుకుని వ్యాధి నుంచి బయట పడవచ్చు.

- డాక్టర్ మస్తాన్‌బాషా, ఆర్థోపెడిక్ సర్జన్, జీజీహెచ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలి



సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా ఆస్టియో పోరోసిస్ బారిన పడుతున్నారు. గ్రామాల్లోనూ గతంలో మాదిరిగా శారీరక శ్రమ చేయడం లేదు. ఇందువల్ల పల్లె ప్రజలు కూడా ఈ వ్యాధికి గురవుతున్నారు. శారీరక వ్యాయామం తప్పకుండా చేయాలి. పౌష్టికాహారం, ఇందులో కాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.

- డాక్టర్ బాలకొండయ్య, కిమ్స్ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు

డీఎస్సీ ఘనత లోకేష్‌దే !

రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ● కొత్త ఉపాధ్యాయులకు సన్మానం



నూతన టీచర్లతో ఎమ్మెల్యే, నాయకులు

నెల్లూరు రూరల్, అక్టోబరు 19,(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిన డీఎస్సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించిందని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌దేనని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 75 మంది డీఎస్సీ విజేతలను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను ఏపీకి తీసుకువచ్చి అందరి చూపు రాష్ట్రం వైపు తిప్పిందన్నారు. పరిశ్రమలు రాకతో అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 28 కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.24 లక్షలకు నగదు చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, రాజానాయుడు, జలదంకి సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమాలకు సహకరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలి

● సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ షాన్‌వాజ్

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ షాన్‌వాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కొన్ని రైసు మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచిపెట్టి అధికారుల అండదండలతో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యానికి పాలిష్‌పట్టి అధిక ధరలకు విక్రయించి ప్రజలను దోచుకుంటున్నారన్నారు. దీనిపై ఓ కమిటీ వేసి విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఘనంగా గంధం ఊరేగింపు


గ్రామంలో సాగుతున్న గంధం ఊరేగింపు

నెల్లూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ములుముడి గ్రామం లో గౌస్ ఏపాక్ మహ బూబ్ సుబహాని దర్గాకు చెందిన గంధమహోత్సవాన్ని శనివారం అర్ధ రాత్రి దాటాక అట్ట హాసంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జాము వరకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. బాణసంచా పేలుళ్లు, ఫకీర్ల జరుబులు, మేళతాళాల నడుమ ఉత్సవం సందడిగా సాగింది. అనంతరం గంధాన్ని దర్గాకు తీసుకువచ్చి భక్తులకు పంచారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు.

సచివాలయాల్లో పనిచేయని ఫైబర్‌నెట్

సీతారామపురం, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ పాలనలో లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి గ్రామ సచివాలయాల కు ఫైబర్ నెట్ బాక్స్‌లు ఏర్పాటుచేశారు. వాటికి నెట్‌వర్క్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో సచివాలయాల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయాల్లో కులం, ఆదాయం, బియ్యంకార్డులు, పింఛన్ దరఖాస్తులు, భూ ముల రీసర్వే వంటి 193 సేవలు అందుబాటులో ఉన్నాయి. ఫైబర్ నెట్ కనెక్షన్లు లేకపోవడంతో సిబ్బంది సెల్‌ఫోన్ల నుంచి నెట్ కనెక్షన్ తీసుకుని ప్రజలకు పత్రాలు అందజేస్తున్నారు.

గూగుల్‌డేటా సెంటర్‌తో విశాఖ అభివృద్ధి


కోవూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గూగుల్‌డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్టణం రూపురేఖలు మారతాయని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు విశాఖకు ఐటీ కంపెనీలు, అమరావతికి క్వాంటమ్ వ్యాలీని తీసుకువస్తున్నారన్నారు. రాయలసీమలో పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టుల్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు చూసి వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకున్నారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12455
వెండి కిలో ధర	రూ. 182000
వెండి ఒక గ్రాము	రూ. 191.00



నేడు పెంచలకోనలో దీపావళి వేడుకలు


రథాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

రాపూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉప కమీషనర్ పీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం శ్రీవార్లకు ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహిస్తామన్నారు. శ్రీవార్ల నిత్యకళ్యాణం రద్దు చేశామని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని మద్దెలమడుగు దగ్గరలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక ఉద్యోగానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీ హనుమంతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఖాళీగా ఉన్న ఒక పోస్టు భర్తీ చేస్తున్నామని, పీజీ డిగ్రీ కలిగి, కనీసం 55 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్.డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివ రాలకు 9441523273 నెంబరులో సంప్ర దించాలని కోరారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కొత్తూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వీవీ శేషయ్య మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. కమిటీ సభ్యులు గంపల మంజుల గాంధీ ఆశయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పల్లిపాడు గ్రామ యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి స్పందన హర్షణీయమని ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఏను విడుదల చేయడం, 60 రోజుల్లో ఆరోగ్యకార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేయడం, ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై వారం రోజుల్లో ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చైల్డ్‌కేర్ లీవ్‌పై సీఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపిందన్నారు. దీపావళి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పట్టుబట్టిన రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందచేత

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహా యనిధి చెక్కులను ఆదివా రం సొసైటీ కార్యాలయంలో బాధితులకు మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసు లురెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం సాగు నీటి సంఘం అధ్య క్షుడు షేక్ బాబు, జండాదిబ్బ, మర్రి పాడు టీడీపీ నాయ కులు కంచర్ల నారాయణ, జనార్ధన్‌రెడ్డి టీడీపీ నాయ కులు, బాధితులుపాల్గొన్నారు.

పెళ్లికానుక..

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోళ్లవీధికి చెందిన షేక్ జానీ బాషా, దిల్‌షాద్ దంపతుల కుమార్తె సబియా వివాహం సందర్భంగా ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి సూచన మేరకు మన ఫౌం డేషన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కుటుంబ సభ్యు లకు రూ.5వేలు ఆర్థిక సా యం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కుడు మట్ల రామయ్య, లక్ష్మయ్య, గాజుల బాబు, అంకయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు చేయూతనందిస్తాం!


గిరిజనులను పరామర్శిస్తున్న జనసేన నాయకులు సురేష్

ముత్తుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు అండగా ఉంటామని సర్వేపల్లి జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తెలిపారు. మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ జంగాల కండ్రిగ కాలువ అంచున నివాసముంటున్న గిరిజన కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉరుస్తున్న గుడిసెల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఈ విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి గుడిసెలు పైన పట్టలు వేయించి ఆదుకుంటామని, కనీస వసతులు కల్పిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని, ప్రజా ప్రభుత్వంగా ప్రజలు ఆదరించారన్నారు. వర్షాలు, వరదల సమయంలో కష్టం వచ్చిన వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సందూరి శ్రీహరి, బోలా అశోక్, కావలి మస్తాన్, దగోలు సుమన్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

75 వసంతాల అపూర్వ కలయిక


పూర్వ విద్యార్థులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి (టౌన్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని పెట్లూరి గోపాలకృష్ణయ్య వీధిబడిలో 70 సంవత్సరాల క్రితం 1955లో ఒకటో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం సాయిబాబా గుడి ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని వారిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 వసంతాలు పూర్తి చేసుకున్న పెద్దలు వివిధ రంగాల్లో రాణిస్తూ నేటికీ ఉత్సాహంగా కనిపిస్తున్నారన్నారు. దాదాపు 25మంది పూర్వ విద్యార్థులు కలుసుకోవడం అద్భుత ఘట్టమన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కావలి, అక్టోబరు 18 (ఆం ధ్రజ్యోతి): నియోజక వర్గం లోని 57 మందికి కావలి టీ డీపీ కార్యాలయంలో ఆదివా రం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 37,22,710 చెక్కులను లబ్ధిదారులకు ఎ మ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే సీఎం రిలీఫ్‌ఫండ్ పంపిణీలో కావలి నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉందన్నారు. వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 1000 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 696 దరఖాస్తు దారులకు రూ. 6,17,48,841 అందజేశామన్నారు. మిగిలిన దరఖాస్తుదారులకు కూడా త్వరలోనే ఆర్థిక సాయం చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన ముందస్తు దీపావళి సంబరాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు దీపావళి సంబ రాలు నిర్వహించారు. ఉదయగిరి నియోజక వర్గ సమన్వయకర్త కొట్టె వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రముఖులతో సహా నాయకులు, కార్యకర్తలను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మేడిద వెంకటేశ్వర్లు, నాయకులు మానం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో దారకానిపాడు

గుడ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారకానిపాడు పోలీసు నిఘాలో ఉంది. హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని ప్రముఖులు పరామర్శిస్తూ ఉండడంతో ఆగ్రామంలో పోలీసులు మోహరించారు. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఆదివారం ఇద్దరు మంత్రులు నారాయణ, అనిత గ్రామంలో పర్యటించారు. ప్ర ముఖులను గ్రామంలోకి అనుమతించకుండా గ్రామశివార్ల లో పోలీసులు చేస్తున్న హడావుడిపై పలువురు నాయకులు మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేదుకు వెళుతుంటే, పోలీసులు అడ్డుకోవడం తగదని, రాధ-రంగా మిత్రమండలి నాయకులు వం గవీటి నరేంద్రకుమార్‌తో పాటు, వైసీపీ స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కంపూడి రాజా అన్నారు.

సర్వేయర్ల కొరతతో రైతుల అవస్థలు

లింగసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వేయర్ల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పలు భూ వివాదాలు ఉన్న మండలంలో సర్వేయర్ల కొరత కారణంగా అటు అధికారులు, ఇటు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా గత మూడేళ్ల నుండి మండలంలో మండల సర్వేయరు పోస్టు ఖాళీగా ఉంది. అయితే తరవాత కొన్ని నెలల పాటు ఇతర మండలాల సర్వేయర్లు అప్పుడప్పుడు ఇన్‌చార్జ్ మండల సర్వేయర్లుగా వ్యవహరించారు. ఇటీవల సుమారు ఏడాది నుండి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

దివ్య 'దీపావళి' సూక్ష్మ సిత్రాలు!

మనుబోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆకులపై సూక్ష్మ చిత్రాలతో అబ్బురపరిచే సూక్ష్మకళారత్నం సోమా పద్మారత్నం ఆదివారం దీపావళి పండుగ సందర్భంగా పలు సిత్రాలను ప్రదర్శించి, తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు.. మర్రి ఆకుపై రామ రావణ సంహారం, రావి ఆకుపై మహిళ దీపం పట్టుకున్న సిత్రాలను కార్వింగ్ ద్వారా, నీటి రంగులతో అందంగా వేసి ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలపడం విశేషం.



మర్రి ఆకుపై రామరావణ చిత్రం,రావి ఆకుపై దీపావళి రూపం

కసుమూరులో సీఎం చంద్రబాబుకు పాలభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మునుస్వామి,

వెంకటాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు గ్రామంలో ఆదివారం ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లెపు మునుస్వామి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మునుస్వామి మాట్లాడుతూ వడ్డెర్లు, వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయించేలా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామమని, చంద్రబాబుకు వడ్డెర్లు రుణపడి ఉంటారన్నారు. వడ్డెర్ల తరపున చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

జలదంకి, అక్టోబర్ 19 (ఆం ధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎల్ఆర్ అగ్రహారంలో ఆదివా రం 'మన ఊరు పిలుస్తోంది' ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిం చారు. ఒంగోలుకు చెందిన హెసిజిఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వ ర్యంలో వైద్యులు వాసు బాబు, ఉషాగ్రేస్ పీటీఆర్ఆర్ ట్రస్ట్ సహకారంతో అవగాహన కల్పించారు. కలుషిత ఆహారం, నీరు, పొగతాగడం, గుట్కా సేవించడం వల్ల ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొన్నారు. తొలి ద శలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయడం సులభమవుతుందన్నారు. వివాహం కాని యువతులు క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ వేయించు కోవాల న్నారు. 45 ఏళ్ల వయస్సు మ హిళలు కూడా వ్యాక్సిన్ ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం 80 మంది క్యాన్సర్ పరీ క్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళి తిరుమల, 'మన ఊరు పిలు స్తోంది' ట్రస్ట్ బాధ్యులు గొట్టిపాటి మురళి, గాలి శ్రీనివాసులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఎస్ఐ ఉమాశంకర్ ఆదివారం పరిశీలించారు. దుకాణాల ఏ ర్పాటుకు అనుమతులు తీసుకో వడంతోపాటు దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులు


రోగులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని ఆర్డీవో బి పావని తెలిపారు. శనివారం రాత్రి విద్యు త్ సమస్యతో రోగులు ఇబ్బందులు పడ్డా రంటూ ఓ వివాదం చెలరేగడంతో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పంది ంచారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరి స్థితిని సమీక్షించాలని ఆయన అధికా రులను ఆదేశించారు. దాంతో ఆదివారం ఆర్డీవో బి పావని డీఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధర్, కూటమి నేతలతో కలిసి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. జనరేటర్ పనితీరును స్వయంగా పరిశీలించారు. రోగులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కేవలం 10 నిమిషాల పాటు మాత్రమే కరెంటు పోయిందని, తమకు ఏ సమస్య తలెత్తలేదని రోగులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మునికృష్ణ మాట్లాడుతూ వర్షం కారణంగా జనరేటర్‌ను 10 నిమిషాల్లో స్టార్ట్ చేశామని, ఎలాంటి సమస్య లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వరు నాయుడు, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్న సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతులుంటేనే బాణసంచా విక్రయించాలి : ఎస్ఐ


బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రఘునాథ్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని అనుమ తులు లేకుండా బాణసంచా అమ్మకాలు సాగించే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్ఐ రఘునాథ్ తెలిపారు. ఆదివారం వరి కుంటపాడు, విరువూరు, నార్త్‌కొండాయ పాళెం, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు పొందిన వ్యాపారులు మాత్రమే అమ్మకాలు సాగించాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలు కూడా బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతా వరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి


ఉదయగిరిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

ఉదయగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ సమీపాన గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. కాగా, దుకాణాలను ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఫైర్ అధికారి హరిబాబు తనిఖీ చేశారు. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం పరిధిలోని సీతారా మపురం, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో పది బాణసంచా దుకాణాలు అనుమతులు పొందినట్లు అధికారులు తెలిపారు. దుకాణాల వద్ద యజమానులు ప్రభుత్వం సూచించిన నియమ, నిబంనధనలు పాటిస్తూ విక్రయాలు చేపట్టాలని వారు సూచించారు.

రొయ్యలు తినండి.. ఆరోగ్యంగా ఉండండి!

● నగరంలో ఎన్‌ఏపీఏ ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్నవెంకటరమణారెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): రొయ్యలు తినండి.. ఆరోగ్యంగా ఉం డండి... అంటూ నెల్లూ రు ఆక్వా కల్చర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఎన్ఏపీఏ) ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ ని ర్వహించారు. ఏసీ స్టేడియం, ట్రంకురోడ్డు, మినీబైపాస్ ప్రాంతాల్లో రొ య్యలపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రొయ్యల వినియోగం పెరిగితే రైతులకు మంచి ధరలు లభిస్తాయని, దేశీయ పరిశ్రమ మరింత బలపడుతుందన్నారు. ఆక్వా డెవల ప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి ఏసీ స్టేడియం వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎన్ఏపీఏ అధ్యక్షుడు మురళీకృష్ణారావు, జనరల్ సెక్రటరీ జయబాబులతోపాటు మత్స్యశాఖ అధికారులు, యూనివర్సిటీ నిపుణులు, ఎగుమతి దారులు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధిలోని జ్యోతినగర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు నగరంలోని కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన ఖాదర్ బాషా, హుస్సేన్ మోటర్ బైకుపై కసుమూరు దర్గాకు వెళ్లారు. తిరిగి నెల్లూరుకు వెళ్తుం డగా జ్యోతి నగర్ సమీపంలోని మలుపు వద్ద ఆటో అడ్డురావడంతో బైకు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయా లయ్యాయి. క్షతగాత్రులను వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరులో పూరిల్లు దగ్ధం


ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

కోవూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు కట్ట సమీపంలోని గిరిజన కాలనీలో ఆదివారం విద్యుదా ఘాతంతో ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. గిరిజన కుటుంబానికి చెందిన కొప్పాల శేషమ్మ ఇంట్లో వర్షపు నీటివల్ల విద్యుదాఘాతం సంభవించడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి బాధితురాలి వద్దకు టీడీపీ నాయకులు కే సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి తది తరులను పంపగా, వారు రూ. 20,000 ఆర్థిక సాయం అందించారు. నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బాధితురాలికి పక్కా గృహం నిర్మించుకునేందుకు సహకరిస్తామని భరోసా ఇచ్చారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యం గుర్తింపు


మద్యం సీసాను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మనుబోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యాప్‌తో మద్యం దుకాణాల్లో నకిలీ మద్యాన్ని గుర్తించవచ్చునని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మూడు మద్యం దుకా ణాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సీసాలను ఎమ్మార్పీ ధరలకు అమ్ముతున్నారా? లేదా? అని డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. అనంతరం సురక్ష యాప్ గురించి దుకాణాల్లో పని చేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ పూర్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. దగదర్తి మండలం తిరివీధిపాడు గ్రామానికి చెందిన రమణమ్మకు ము గ్గురు ఆడపిల్లలున్నారు. మూడవ కుమార్తె పావనిని ఇటీవలే బెంగళూరు వాసి మల్లితో వివాహం చేశారు. దసరా పండుగకు పావని భర్తతో కలిసి సొంతూరుకు వచ్చింది. వారిద్దరు ఈ నెల 1వ తేదీ బెంగళూరుకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరి నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు చేరుకున్నారు. అక్కడ వాష్‌రూమ్‌కు వెళ్లివస్తానని భర్తకు చెప్పి పావని వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించిన మల్లి ఫలితం లేకపోవడంతో పావని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు కూడా గాలించినా ప్రయోజనం లేకపో వడంతో ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను వేదాయపాలెం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వేదాయపాలెం త్యాగరాజ నగర్‌లోని శంకరయ్య అపార్ట్‌మెంట్‌లో నివసించే కిషోర్ కుమార్‌పై ఈ నెల 17వ తేదీ హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సైదాపురం గ్రామం తూర్పువీధికి చెందిన పాకనాటి రోహిణికుమార్ అలియాస్ రోహిత్‌రెడ్డి ప్రస్తుతం బుజబుజ నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ఉంటున్నారు. జనశక్తి నగర్‌కు చెందిన కీర్తిభరత్, చంద్రమౌళి నగర్‌కు చెందిన కొమ్ముల కార్తీక్‌లు ఆయనకు స్నేహితులు. కిశోర్ కుమార్ భార్యతో రోహిత్‌రెడ్డికి కొంత కాలంగా స్నేహం ఉంది. ఈ విషయం ఆమె భర్త, ఆమె తండ్రి శేషాద్రికి తెలిసింది. దీంతో వారు రోహిత్‌రెడ్డిని మందలించారు. అప్పటి నుంచి రోహిత్‌రెడ్డి వారి మీద కక్ష పెంచుకున్నాడు. స్నేహితులు కీర్తి భరత్, కొమ్ముల కార్తీక్‌తో కలిసి కిషోర్ కుమార్‌ను చంపాలన్న ఉద్దేశంతో ఆయన ఇంటికి వెళ్లారు. తలుపులు తెరిచిన వెంటనే అతని మొహంపై చేతులతో, తలపై బీరు బాటిళ్లతో దాడి చేశారు. పగిలిన బీరు బాటిల్‌తో గొంతు వద్ద పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రోహిత్‌రెడ్డిపై సైదాపురం పోలీసు స్టేషన్‌లో కిడ్నాప్, హత్య కేసులున్నా యని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కందుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్‌బాల్ మహిళా, పురుషుల జట్ల ఎంపిక జరిగినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వలేటి రవీంద్ర తెలిపారు. జిల్లా నుంచి 40 మంది పురుషులు, 30 మంది మహిళలు పాల్గొనగా ప్రతిభ కనపరిచిన 12 మంది చొప్పున జట్లు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్లు 11వ సీనియర్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు నవంబరు 7 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు, సభ్యులు, పీడీలు పాల్గొన్నారు.

సర్వేయర్ల కొరతతో రైతుల అవస్థలు

లింగసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వేయర్ల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పలు భూవివాదాలు ఉన్న మండలంలో సర్వేయర్ల కొరత కారణంగా అటు అధికారులు, ఇటు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా గత మూడేళ్ల నుండి మండలంలో మండల సర్వేయరు పోస్టు ఖాళీగా ఉంది. అయితే తరవాత కొన్ని నెలల పాటు ఇతర మండలాల సర్వేయర్లు అప్పుడప్పుడు ఇన్‌చార్జ్ మండల సర్వేయర్లుగా వ్యవహరించారు. ఇటీవల సుమారు ఏడాది నుండి ఈ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇదిలా ఉండగా మండలంలోని 13 సచివాలయాలకు గాను ప్రస్తుతం నలుగురు సర్వేయర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 13 సచివాలయాలకు 13 మంది సర్వేయర్లు ఉండగా, నలుగురు సర్వేయర్లు బదిలీపై వెళ్లిపోగా 9 మంది సర్వేయర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత జూన్ నెలలో జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ఏడుగురు సర్వేయర్లు బదిలీపై వెళ్లిపోగా, ఇద్దరు మాత్రమే మండలానికి బదిలీపై వచ్చారు. దీంతో నలుగురు సర్వేయర్లు మాత్రమే మిగిలారు. దీంతో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. వీరి నలుగురిలో ఒకరు నారసింహాపురంలో భూముల రీసర్వే నిర్వహిస్తుండగా, మరొకరు చీమలపెంట రీసర్వే పూర్తి కాగా, వాటి ఫైనల్ రికార్డును తయారు చేస్తున్నారు. ఇక మిగిలిన ఇద్దరు సర్వేయర్లు స్వామిత్వ సర్వే చేస్తున్నారు. దీంతో రైతులు తమ భూములు కొలిపించుకోవాలంటే నానా అగచాట్లు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సర్వేయర్ల కొరత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీఏ విడుదల హామీ హర్షణీయం

నెల్లూరు(విద్య/హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఉద్యోగులకు డీఏ విడుదలకు హామీ ఇవ్వడం హర్షణీయమని ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎస్ తిరుమలయ్య, సీహెచ్ చెన్నయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్క డీఏ ఇచ్చినా అత్యంత గౌరవంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివి



లక్ష్మయ్య నాయుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరాం

కందుకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడు హత్యకు గురికావడంతో కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని, చోటు చేసుకున్న సంఘటనను అధిష్టానం దృష్టికి తీసుకెళ తానని పేర్కొన్నారు.

పోలీసు పహారాలో దారకానిపాడు

గుడ్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారకానిపాడు పోలీసు నిఘాలో ఉంది. హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మయ్యనాయుడి కుటుంబాన్ని ప్రముఖులు పరామర్శిస్తూ ఉండడంతో ఆగ్రామంలో పోలీసులు మోహరించారు. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఆదివారం ఇద్దరు మంత్రులు నారాయణ, అనిత గ్రామంలో పర్యటించారు. ప్రముఖులను గ్రామంలోకి అనుమతించకుండా గ్రామశివార్లలో పోలీసులు చేస్తున్న హడావుడిపై పలువురు నాయకులు మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేదుకు వెళుతుంటే, పోలీసులు అడ్డుకోవడం తగదని, రాధ-రంగా మిత్రమండలి నాయకులు వంగవీటి నరేంద్రకుమార్‌తో పాటు, వైసీపీ స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కంపూడి రాజా అన్నారు. అతి కష్టమ్మీద బాధిత కుటుంబం వద్దకు చేరుకున్న వంగవీటి నరేంద్రకుమార్ మాట్లాడుతూ లక్ష్మయ్య నాయుడి కుటుంబాన్ని దారకానిపాడుకు చెందిన కాకర్ల హరిచంద్రప్రసాద్, అతని తండ్రి మాధవరావులు ఉద్దేశ్యపూర్వకంగానే కారుతో తొక్కించి చంపారని ఆరోపించారు. చంపిన, చంపడిన ఇద్దరు యువకులు ప్రాణస్నేహితులని, ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు కొందరు కథలు అల్లుతున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు, వివిధ రూపాల్లో పోరాటం చేస్తామన్నారు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభం

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు. అందులో భాగంగా వైసీపీ నాయకులు మండలంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్టేళ్ల క్రిష్ణయ్య, నాగిరెడ్డి శివరామిరెడ్డి, ఇరపని అంజయ్య, పొట్టేళ్ల అంజయ్య, పోలినేని పాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎముకలను గుల్లచేసే ఆస్టియో పోరోసిస్

- అప్రమత్తత అవసరం
- లేకపోతే మంచానికే పరిమితం
- మహిళలూ.. తస్మాత్ జాగ్రత్త అంటున్న వైద్యులు
- జిల్లాలో 2.30 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
- నేడు ప్రపంచ బోలు ఎముకల నివారణ దినం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్టియో పోరోసిస్.. ఇది ఎముకలను బోలుగా మార్చే వ్యాధి. దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు. బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోవడంతో శరీరంలో శక్తి క్షీణించడమే కాకుండా ఎముకల పటుత్వం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. ఎక్కువగా వృద్ధులకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువకుల్లోనూ కనిపి స్తోంది. ప్రత్యేకించి మహిళలలో ఆ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ వ్యాధి వల్ల ఒక్కసారిగా దీర్ఘకాలిక వ్యాధులకు లోనయ్యే ప్రమాదం ఉంది. ప్రత్యేకించి రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో ఈస్ట్రోజన్ శాతం తగ్గి ఎముకల్లో కాల్షియం క్షీణించి ఆస్టియో పోరోసిస్ వ్యాధికి గురవుతున్నారు. ఒక్కోసారి ఈ వ్యాధి మరణాలకు కూడా దారి తీస్తుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో 2.30 లక్షల మంది వ్యాధిగ్రస్థులు

జిల్లావ్యాప్తంగా వృద్ధులు 5 లక్షల మందికిపైగా ఉండగా వారిలో 1.50 లక్షల మంది బోలు ఎముకుల వ్యాధికి గురైనట్లు గణాంకాలు చెబుతున్నా యి. మరో 80వేల మంది మహిళలు, యువకులు ఈ వ్యాధితో బాధప డుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, రాపూరు తదితర మండలాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాలలో సైతం ఆధునిక పనిముట్లు అందబాటులోకి రావటంతో శారీరక శ్రమ తగ్గింది. బలవర్ధకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీనికితోడు అవగాహన లేమితో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో కొందరు మంచానికే పరిమితం అవుతున్నారు.

మహిళలూ.. జాగ్రత్త!

ఆస్టియో పోరోసిస్ వ్యాధి ప్రభావం మహిళల్లో ఎక్కువగా ఉంది. 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు ఈ వ్యాధికి గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. విటమిన్ డీ లోపం, కాల్షియం తక్కువగా తీసుకోవడం, రుతుస్రావం తొందరగా ఆగిపోవడం, జన్మపరమైన కారణాలు, రోగ నిర్ధారణ నియమాలు లేకపోవడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాలతో మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. థైరాయిడ్ బాధితుల్లో ఆ ప్రభావం ఎముకల సాంద్రతపై పడుతోంది. సూర్యకాంతిలో గడిపే సమయం తక్కువగా ఉండటం, కాలుష్యం పెరిగిపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం దీనికి ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

- జీవనశైలిలో తప్పనిసరిగా మార్పులు చేసుకోవాలి.
- మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- యువతీ యువకులు మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.
- దృఢమైన ఎముకలు, పగుళ్ల నివారణ కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. అందులో విటమిన్ డీ కూడా ఉండాలి.
- తక్కువ కొవ్వు ఉండే పాల ఉత్పత్తులు, పెరుగు, వెన్న, పచ్చని ఆకుకూరలు, చేపలు, బాదంపప్పు వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- తృణ ధాన్యాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి.
- ఎత్తుగా ఉండే బూట్లు వాడడం కూడా తగ్గించాలి.
- పుష్కలంగా ఉండే విటమిన్ డీ, కాలుష్యం ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- ఎముకల సాంద్రత తగ్గిపోవడాన్ని నివారించే మందులు అందుబాటులో ఉన్నాయి.
- ఈస్ట్రోజన్ హార్మోన్ చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి.

ఆధునిక వైద్య విధానాలు

డాక్టర్ మస్తాన్‌బాషా, ఆర్థోపెడిక్ సర్జన్, జీజీహెచ్

అస్టియో పోరోసిస్ వ్యాధి చికిత్సకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్లపైబడ్డ వారు తప్పనిసరిగా ఎముకల పరీక్ష చేయించుకోవాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలి. వ్యాధిపై నిర్లక్ష్యం వహించరాదు. వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్సలు చేయించుకుని వ్యాధి నుంచి బయట పడవచ్చు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలి

● డాక్టర్ బాలకొండయ్య, కిమ్స్ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు

సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా ఆస్టియో పోరోసిస్ బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ గతంలో మాదిరిగా శారీరక శ్రమ చేయడం లేదు. ఇందువల్ల పల్లె ప్రజలు కూడా ఈ వ్యాధికి గురవుతున్నారు.

క్రీడాకారిణులకు స్పోర్ట్స్ షూ అందజేత



క్రీడాకారిణికి షూ అందజేస్తున్న డాక్టర్ మోహనరావు

కావలి (టౌన్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విశ్వోదయ బాలికోన్నత పాఠశాలకు చెందిన కబడ్డీ, ఖోఖో క్రీడాకారిణులకు బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ చేయూతను అందించింది. ఆదివారం పాఠశాల ఆవరణలో స్పోర్ట్స్ షూ అందించారు. బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ మోహనరావు రూ, 19,000 విలువ చేసే బూట్లు పంపిణీ చేశారు. సభ్యులు రైటర్ శ్రీనివాసులు, గోపాల్, వెంకయ్య, సుంకు కృష్ణ, ఏల్చూరి మధు, క్లాత్ శీను, పీడీలు రాజేశ్వరి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలోని మద్దెలమడుగు దగ్గరలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక ఉద్యోగానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీ హనుమంతయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఖాళీగా ఉన్న ఒక పోస్టు భర్తీ చేస్తున్నామని, పీజీ డిగ్రీ కలిగి, కనీసం 55 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్.డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9441523273 నెంబరులో సంప్రదించాలని కోరారు.



కావలి
కందుకూరు

భాను అకాల మృతిపై ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి దిగ్భ్రాంతి

కావలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మాలేపాటి బాను చందర్ అకాల మృతి తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భాను మృతికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడి సోదరుడు, సీనియర్ టీడీపీ నాయకుడు రవీంద్రనాయుడి తనయుడు మాలేపాటి భానుచందర్ అకాల మృతికి పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, శాసనమండలి సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, ఉదయగిరి మాజీ శాసన సభ్యుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లినేని రామారావు తదితరులు భాను మృతి పట్ల సంతాపం వ్యక్తం ఉన్నారు.

కావలిలో 27 దుకాణాల ఏర్పాటు


మినీ స్టేడియంలో దుకాణాలు

కావలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ స్టేడియంలో ప్రభుత్వ నిబంధనల మేరకు 27 బాణాసంచా దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక శాఖా ధికారులు యంత్రాన్ని, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. ప్రతి దుకాణ దారు డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేప ట్టారు. గత రెండు రోజులుగా చిరు జల్లులు పడుతుండటంతో బాణసం చా వ్యాపారం డల్‌గా ఉంది. వర్షం కొంత తెరపిస్తే వ్యాపారాలు చేసు కోవాలని వ్యాపారులు ఎదురు చూస్తున్నారు.





'ఫుడ్ పొలిటిక్స్' రెస్టారెంట్ ప్రారంభం


ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని సత్కరిస్తున్న సాయిజిగీషా, విజయ్‌శంకర్

కావలి (టౌన్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ పొలిటిక్స్ రెస్టారెంట్, కేఫ్‌ను ఆదివారం ఎమ్మెల్యే డి క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు విడవలపాటి విజయ్‌శంకర్, సాయిజిగీషా దంపతులు ఎమ్మెల్యేని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన దంపతులు రెస్టారెంట్ వ్యాపార రంగంలో అడుగిడడం అభినందనీయమన్నారు. రుచి, శుచికరమైన వంటకాలతో ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని, హోటల్ వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందాలని విజయ్‌శంకర్ దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఫ్యాఫ్టో జిల్లా చైర్మన్ కంచర్ల మధుసూధన్‌రావు, ఎంఈవో వెంకటసుబ్బయ్య, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.





సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి

కావలి, అక్టోబరు 18 (ఆం ధ్రజ్యోతి): నియోజక వర్గం లోని 57 మందికి కావలి టీ డీపీ కార్యాలయంలో ఆదివా రం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 37,22,710 చెక్కులను లబ్ధిదారులకు ఎ మ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే సీఎం రిలీఫ్‌ఫండ్ పంపిణీలో కావలి నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉందన్నారు. వైద్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 1000 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 696 దరఖాస్తు దారులకు రూ. 6,17,48,841 అందజేశామన్నారు. మిగిలిన దరఖాస్తుదారులకు కూడా త్వరలోనే ఆర్థికసాయం చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలు వురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





క్యాన్సర్ వ్యాధిపై అవగాహన



కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వాసుబాబు

జలదంకి, అక్టోబర్ 19 (ఆం ధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎల్‌ఆర్ అగ్రహారంలో ఆదివా రం 'మన ఊరు పిలుస్తోంది' ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యా ధిపై అవగాహన కార్యక్రమం, స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన హెసిజీఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యులు వాసుబాబు, ఉషాగ్రేస్ పీటీఆర్‌ఆర్ ట్రస్ట్ సహకారంతో అవగాహన కల్పించారు. కలుషిత ఆహారం, నీరు, పొగతాగడం, గుట్కా సేవించడం వల్ల ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొన్నారు. తొలి ద శలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయడం సులభమవుతుందన్నారు. వివాహం కాని యువతులు క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ వేయించు కోవాల న్నారు. 45 ఏళ్ళ వయస్సు మ హిళలు కూడా వ్యాక్సిన్ ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. అనం తరం 80 మంది క్యాన్సర్ పరీ క్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళి తిరుమల, 'మన ఊరు పిలు స్తోంది' ట్రస్ట్ బాధ్యులు గొట్టి పాటి మురళి, గాలి శ్రీనివాసులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.





టపాసుల దుకాణాల పరిశీలన


టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ఉమాశంకర్

కలిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఎస్ఐ ఉమాశంకర్ ఆదివారం పరిశీలించారు. దుకాణాల ఏ ర్పాటుకు అనుమతులు తీసుకో వడంతోపాటు దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలు దీపావళి రోజున టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణ నిర్వాహకుడు సుద్దుల మోహన్ పాల్గొన్నారు.



భారీ వర్షంతో లోతట్టు జలమయం

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో సుమారు 140 మిల్లీమీటర్ల (14 సెంటీమీటర్ల) వర్షపాతం నమోదైంది. దీంతో సంగం కొండకు దిగువ కాలనీ, కొత్తూరు, సాయినగర్ తదితర లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12308
వెండి కిలో ధర	రూ. 175000
వెండి ఒక గ్రాము	రూ. 181.00



జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులు

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో రోగులకు మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని ఆర్డీవో బి పావని తెలిపారు. శనివారం రాత్రి విద్యుత్ సమస్యతో రోగులు ఇబ్బందులు పడ్డారంటూ ఓ వివాదం చెలరేగడంతో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దాంతో ఆదివారం ఆర్డీవో బి పావని డీఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధర్, కూటమి నేతలతో కలిసి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. జనరేటర్ పనితీరును స్వయంగా పరిశీలించారు. రోగులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కేవలం 10 నిమిషాల పాటు మాత్రమే కరెంటు పోయిందని, తమకు ఏ సమస్య తలెత్తలేదని రోగులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మునికృష్ణ మాట్లాడుతూ వర్షం కారణంగా జనరేటర్‌ను 10 నిమిషాల్లో స్టార్ట్ చేశామని, ఎలాంటి సమస్య లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్న సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోగులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, నేతలు

అనుమతులుంటేనే బాణసంచా విక్రయించాలి : ఎస్‌ఐ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని అనుమతులు లేకుండా బాణసంచా అమ్మకాలు సాగించే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. ఆదివారం వరికుంటపాడు, విరువూరు, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు పొందిన వ్యాపారులు మాత్రమే అమ్మకాలు సాగించాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలు కూడా బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.


బాణసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రఘునాథ్

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ఉదయగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ సమీపాన గల వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. కాగా, దుకాణాలను ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఫైర్ అధికారి హరిబాబు తనిఖీ చేశారు. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రం పరిధిలోని సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో పది బాణసంచా దుకాణాలు అనుమతులు పొందినట్లు అధికారులు తెలిపారు. దుకాణాల వద్ద యజమానులు ప్రభుత్వం సూచించిన నియమ, నిబంనధనలు పాటిస్తూ విక్రయాలు చేపట్టాలని వారు సూచించారు.


ఉదయగిరిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

జనసేన ముందస్తు దీపావళి సంబరాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త కొట్టె వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రముఖులతో సహా నాయకులు, కార్యకర్తలను కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మేడిద వెంకటేశ్వర్లు, నాయకులు మానం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు భూములు కేటాయించడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి పంచాయతీల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించడం దారుణమని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయా పంచాయతీల రైతులతో కుర్రపల్లి బీసీ కాలనీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మంజూరుచేసిన భూములను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించడం అన్యాయమని, అధికారులు చర్యలు తీసుకొని పరిశ్రమలకు కేటాయించిన భూములను రద్దు చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయ భవనం

● బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉదయగిరి తహసీల్దారు కార్యాలయ భవనం ఉరుస్తుండడంతో అధికారులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి పెంకులు, సిమెంట్ పెచ్చులు పైన పడుతుండడంతో ఉద్యోగులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి కార్యాలయంలో అన్ని గదులు ఉరుస్తుండడంతో కంప్యూటర్లు, రికార్డులు తడవకుండా సిబ్బంది వాటిపై పట్టలు ఏర్పాటుచేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం

సచివాలయాల్లో పనిచేయని ఫైబర్‌నెట్

● సిబ్బంది అవస్థలు

సీతారామపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి గ్రామ సచివాలయాలకు ఫైబర్ నెట్ బాక్స్‌లు ఏర్పాటుచేశారు. వాటికి నెట్‌వర్క్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో సచివాలయాల్లో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గ్రామ సచివాలయాల్లో కులం, ఆదాయం, బియ్యంకార్డులు, పింఛన్ దరఖాస్తులు, భూముల రీసర్వే వంటి 193 సేవలు అందుబాటులో ఉన్నాయి. ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు లేకపోవడంతో సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది సెల్‌ఫోన్ల నుంచి నెట్ కనెక్షన్ తీసుకుని పత్రాలను ప్రజలకు అందజేస్తున్నారు. కొన్ని సమయాల్లో నెట్‌వర్క్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సొంత నిధులను వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని మండలంలోని 9 గ్రామ సచివాలయాలకు ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు ఇవ్వాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.


సచివాలయంలో మూలకు చేరిన ఫైబర్ నెట్ బాక్సు

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి స్పందన హర్షణీయమని ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి కానుకగా నవంబరు నెల నుంచి ఒక డీఏను విడుదల చేయడం, 60 రోజుల్లో ఆరోగ్యకార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేయడం, ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై వారం రోజుల్లో ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చైల్డ్‌కేర్ లీవ్‌పై సీఎం చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపిందన్నారు. దీపావళి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పట్టుబట్టిన రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందచేత

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం సొసైటీ కార్యాలయంలో బాధితులకు మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం సాగు నీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, జండాదిబ్బ, మర్రి పాడు టీడీపీ నాయకులు కంచర్ల నారాయణ, జనార్ధన్‌రెడ్డి టీడీపీ నాయకులు, బాధితులుపాల్గొన్నారు.

పెళ్లికానుక అందజేత

ఉదయగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోళ్లవీధికి చెందిన షేక్ జానీ బాషా, దిల్‌షాద్ దంపతుల కుమార్తె సబియా వివాహం సందర్భంగా ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి సూచన మేరకు మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మట్ల రామయ్య, లక్ష్మయ్య, గాజుల బాబు, అంకయ్య పాల్గొన్నారు.

→ తిరుపతిలో పూలమార్కెట్ వద్ద కిటకిటలాడుతున్న జనం



జిల్లాలో ఆదివారం దీపావళి సందడి నెలకొంది. కేదారగౌరీ వ్రతం పూజా సామగ్రి, గుమ్మడి కాయలు, ప్రమిదల కొనుగోళ్లతో తిరుపతి సహా పట్టణాల్లో దుకాణాల వద్ద జనం కిక్కిరిశారు. టపాకాయల కొనుగోలు కేంద్రాల వద్ద జనం పలచగా కనిపించారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

దీపావళి సందడి



ముక్కంటి ఆలయంలో కార్తీక శోభ

- కేదార గౌరీవ్రతానికి ఏర్పాట్లు పూర్తి







ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు చేశారు. భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లు ఆలయ అధికారులు చేస్తున్నారు. అదే విధంగా బ్రహ్మగుడి ఆవరణలో కేదారిగౌరీవ్రతం జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లును కూడా పూర్తి చేశారు.

ఎస్వీఎంసీలో పారా మెడికల్ కోర్సులకు ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలోని పలు డిప్లమా అలైడ్ హెల్త్‌సైన్స్ ప్రొఫెషనల్ కౌన్సిల్, పారా మెడికల్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు ఈ నెల 21న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవిప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీలో 3, డిప్లమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు అర్హులైన విద్యార్థులు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9440879943కు సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) రద్దు చేశారు. దీనిని గమనించి ఎవరూ తిరుపతికి రావద్దని ఎస్పీ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా తక్షణ సహాయం కోసం సమీప పోలీసు స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

మద్యం మత్తులో రౌడీల వీరంగం

తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):తిరుపతిలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో రౌడీలు వీరంగం చేశారు.తుడా రోడ్డు సర్కిల్ వద్ద కొందరు తప్పతాగి అటువెళ్లే వాహనాలు ఆపి దాడికి దిగారు. ఈ దాడిలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు ఆ తాగుబోతులను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళన చెందారు.

మట్టి ప్రమిదల పంపిణీ

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట బజారులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం కోట టౌన్ రోటరీ క్లబ్ దాతృత్వంతో మహిళలకు ఉచితంగా మట్టి ప్రమిదలను పంపిణీ చేశారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, పెన్నక్క చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార సంఘం చైర్మన్ ఉచ్చూరు రవీంద్రనాథ్‌రెడ్డి, పసుపులేటి కిషోర్, మధుయాదవ్ చేతుల మీదుగా మహిళలకు మట్టి ప్రమిదలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షంషుద్దీన్, దారా సురేష్, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మట్టి ప్రమిదలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఆలయ భూముల పరిరక్షణకే వేలం: టీడీపీ

వాకాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న నాగేశ్వరస్వామి, అళఘునాథస్వామి, కోదండరామస్వామి ఆలయాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించారు. విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాల పరిధిలో ఉన్న 95 ఎకరాలు ఉండగా, అందులోని 20 ఎకరాల్లో బీసీ కాలనీ, మసీదు, పశువుల ఆస్పత్రి ఉన్నాయన్నారు. మిగిలిన భూములకు వేలం నిర్వహిస్తే ఆయా దేవాలయాలకు ఆదాయం చేకూరుతుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కేవలం రూ.13 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు వైసీపీ నాయకులు లెక్కలు చూపారని, కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ5.20 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు.

రైతులకు అండగా ఉంటాం: నేదురుమల్లి

వాకాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్యాయం జరిగితే నేదురుమల్లి కుటుంబం అండగా ఉంటుందని నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వాకాడులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అళఘునాథస్వామి, నాగేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల భూములకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి ట్రస్టు సేవలు విస్తరించాలి

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోటలోని పసుపులేటి చారిటబుల్ ట్రస్టు సేవలు మరింతగా విస్తరించాలని సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోటలోని ప్రగతి ఆస్పత్రిలో కాన్పు చేయించుకొన్న ఇద్దరు బాలింతలకు ట్రస్టు ద్వారా రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి ఆస్పత్రి చైర్మన్ పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ, షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందన

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యా సంస్థల్లో సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సభ ఆదివారం జరిగింది. ఉపాధ్యాయులను వాకాడు ఎంఈవో నసీం ఆలీ, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, షిరిడీ సాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, అనంతాచార్యులు శాలువాలు, మెమెంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆవుల సుబ్బయ్య, రవి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మదీనా కాలనీలో కార్డన్ సెర్చ్

తడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తడ కండ్రిగ పంచాయతీ మదీనా కాలనీలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని పోలీసులు తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ చెంచుబాబు కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.





12వ పీఆర్సీని ప్రకటించండి


గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచాలని, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. నవంబరు 15,16 తేదీల్లో ఒంగోలులో జరగనున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, చెంగయ్య, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కేసులకు భయపడేది లేదు: కిలివేటి

తడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అక్రమ కేసులు బనాయిస్తే భయపడేవారు ఎవరూ లేరని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం పూడి గ్రామంలో సర్పంచ్ పరమశివం కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పరమశివంరెడ్డిపై 7 అక్రమ కేసులు నమోదు చేశారని, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా మళ్లీ కొత్తగా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఇలాగే చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఆర్ముగం, మునస్వామి రెడ్డి, సుందరరెడ్డి, పృధ్వీ, తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

వాకాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందన హర్షణీయమని వాకాడు, కోట మండలాల ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. దీపావళి పండుగ కానుకగా నవంబరు నుంచి ఒక డీఏ విడుదల, 60 రోజుల్లో నగదు రహిత వైద్యం అందేలా చూసేందుకు కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.









నడవాలన్నా.. నరకమే

అధ్వానంగా యాలకారికండ్రిగ రోడ్డు



బురదలో దిగబడిపోయిన ఆటోను నెట్టుతున్న ప్రయాణికులు


పెళ్లకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నడవాలంటేనే నరకం చూపిస్తున్న రోడ్డుతో యాలకారికండ్రిగ గ్రామస్తులు విసిగిపోతున్నారు. మండలంలోని చింతపూడి నుంచి యాలకారికండ్రిగకు వెళ్లే రోడ్డు బురదమయమై దుస్థితికి చేరుకుంది. సుమారు కిలోమీటరు ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో కనీసం స్కూల్ బస్సులు కూడా రావడంలేదు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడడం సర్వసాధారణంగా మారింది. రోడ్డును బాగు చేయాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదు. తారు రోడ్డు కాకపోయిన కనీసం గ్రావెల్ తోలి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని ఆ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, పోలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కోటలో భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రాయితీలను కొనసాగించాలన్నారు. అదే విధంగా సభ్యత్వాలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికసంఘం గూడూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్‌డి రఫీ, నాయకులు గండికోట మధు తదితరులు ఉన్నారు.

లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణ అన్నారు. ఆదివారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసులు దుకాణాలను ఆయన పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని యజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.






బాణసంచా దుకాణంలో తనిఖీలు

పెళ్లకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని ఆదివారం సాయంత్రం తహసీల్దార్ హరికృష్ణ, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు తనిఖీ చేశారు. దుకాణదారులు నిబంధనలను అమలు చేస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. నింబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఆర్ఐ సంతోషీబాయి ఉన్నారు.

కోటి సంతకాల సేకరణ

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం అల్లంపాడులో ఆదివారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ జరిగింది. ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్, వైసీపీ సీఈసీ సభ్యుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పరిశీలకుడు దీరేంద్ర వర్మ తదితరులు స్థానికుల నుంచి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, ప్రసాద్‌గౌడ్, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, పాముల సురేంద్ర, కస్తూరయ్య యాదవ్, ఈశ్వరరెడ్డి, రాంబాబు, జడ్పీటీసీ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.









ఉద్యోగుల హామీల అమలు హర్షణీయం


ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీఎన్జీవోస్ నేతలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడమే కాకుండా బకాయిలు చెల్లిస్తుండటం హర్షణీయమని ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు అన్నారు. స్థానిక ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఏపీఎన్జీవోస్ నేతలతో కలిసి థ్యాంక్యూ సీఎం సార్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఏ ప్రకటించకుండా, బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించడం సంతోషకరమన్నారు. జీపీఎస్, ఏపీజీఎల్ఐ, సీపీఎస్‌లతోపాటు ఉద్యోగులకు రావాల్సిన కాంట్రిబ్యూషన్, ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కలిపి ఇప్పటికే రూ.15 వేల కోట్లు చెల్లించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి శ్రీనివాసులు, నేతలు మురళి, లోకేష్ పాల్గొన్నారు.

థ్యాంక్యూ సార్...ప్రభుత్వ బహుమతి అందింది


పూజకు శాలువకప్పి సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), అకోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా వర్సిటీ సమీపంలోని గాయత్రినగర్‌కు చెందిన దండు పూజ 2023 అక్టోబరులో గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో షటిల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. అలాగే టీమ్ ఉమెన్ క్యాటగిరిలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఆ మేరకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆమెకు నగదు బహుమతి ప్రకటించింది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు నగదు బహుమతులు జమ చేయడంలో భాగంగా పూజకు రూ.8లక్షలు అందింది. ఈ క్రమంలో ఆమె ఆదివారం శాప్ చైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పూజను సత్కరించారు. మరిన్ని పతకాలు సాధించి, దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు

- టీటీడీ బోర్డు చైర్మన్, ఈవో

తిరుమల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తుల జీవితాల్లో దీపావళి వెలుగు, సంతోషం నింపాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆకాంక్షించారు. శ్రీవారి భక్తులకు, ఉద్యోగులకు, శ్రీవారి సేవకులకు ఆదివారం ఓ ప్రకటన ద్వారా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళి ప్రతి ఇంటా వెలుగులు నింపాలి


కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ దీపావళి పండుగ జిల్లాలోని ప్రతి ఇంటా వెలుగులు నింపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. అంధకారంపై వెలుగు సాధించిన విజయమే దీపావళి అని పేర్కొన్నారు. బాణసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుని ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం నిండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


సురక్షిత దీపావళి అందరి బాధ్యత


ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సిరి, సౌభాగ్యం నింపాలని అంకాక్షించారు. పిల్లలు టపాకాయలు కాల్చే సమయంలో పెద్దలు దగ్గర ఉండాలని సూచించారు. బాణసంచా కేంద్రాలు, వ్యాపారులు భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు కంట్రోలు రూము 112కు సమాచారమివ్వాలని కోరారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

తిరుపతి(విద్య), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్న గారి బాలాజీ తెలిపారు. శనివారం రాత్రి విజయవాడలోని సీఎం నివాసంలో జరిగిన ఉద్యోగ సంఘాల నేతల సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. పీఆర్సీని నియమించి వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏల విడుదల, హెల్త్‌కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమ స్యల పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, హైస్కూల్ ప్లస్‌ను బలోపేతం చేయడం, సీపీఎస్ ఉద్యోగులపై కేసులను ఎత్తివేయడం వంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు బాలాజీ తెలిపారు.




19 ఎన్‌పేట 1: ఎంపీ గురుమూర్తితో ఎన్ఎస్ఆర్ కాలనీవాసులు

ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయండి

నాయుడుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల దళితవాడ రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని ఆయా కాలనీవాసులు ఆదివారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలసి వినతిపత్రం అందజేశారు. రైల్వే గేట్ మరమ్మతులకు గురవడంతో మూసివేశారని, దీంతో దాదాపు 8 కిలోమీటర్లు చుట్టు తిరిగి తమ కాలనీలకు రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, రైల్వే డివిజన్ మేనేజర్‌కు విషయం తెలియజేసి సమస్య పరిష్కారం చూపుతామని ఎంపీ గురుమూర్తి చెప్పారు. కార్యక్రమంలో తడుకు చెందు, గోవిందు శ్రీనివాస్, వెంకటేష్, మునస్వామి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో కక్షసాధింపు చర్యలు సరికాదని కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆది శేషయ్య అన్నారు. ఆదివారం స్థానిక శివనాగేశ్వరి ఫంక్షన్ హాల్‌లో కుమ్మరి శాలి వాహన సంఘం సమావేశం నిర్వహించారు. వెంకటగిరిలో జనసేనా పార్టీని నిలబెట్టిన ది గూడూరు వెంకటేశ్వర్లును వ్యక్తిగత కక్షలతో అక్రమంగా అరెస్టు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘ నాయకులు శివ, రమేష్, ఏకాంబరం, కృష్ణయ్య, వేణుగోపాల్, రాజేష్, రత్నయ్య, చంద్ర, చంద్ర మౌళి, మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం రెడ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా దివ్యాంగులకు దుస్తులు, స్వీట్లు, టపాసులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు మనపాటి రవీంద్రబాబు, జనా సుధీర్, రాజేష్, శ్రీనివాసాచారి, శ్రీధర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్


పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ


దివ్యాంగులకు కూరగాయల పంపిణీ

గూడూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణం రాజు, నాగరాజు, చెంచునారాయణ, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




















19మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడిచిన 24 గంటల్లో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చౌడేపల్లెలో 56, అత్యల్పంగా చిత్తూరు అర్బన్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా సోమలలో 9.2, పుంగనూరులో 34.6, ఐరాలలో 12.8, గుడిపాలలో 10, తవణంపల్లెలో 9.8, కార్వేటినగరంలో 9.4, సదుంలో 8.2, రొంపిచెర్లలో 7.2, పులిచెర్లలో 7, ఎస్ఆర్‌పురంలో 6.2, పెద్దపంజాణి, గంగవరంలో 5.8, కుప్పంలో 5.4, పెనుమూరులో 3.2, గుడుపల్లెలో 2.6, చిత్తూరు రూరల్‌లో 1.6, వీకోటలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చిత్తూరు జిల్లా వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసపురానికి చెందిన ప్రకాష్‌కు గుడియాత్తం తాలూకా తట్టపారకు చెందిన రాజశ్రీతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో పిల్లలు కలగలేదని మనస్తాపంతో శనివారం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. దీంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం పులిమడుగు సమీపంలోని మునిక్రిష్ణయ్య బావిలో రాజశ్రీ(20) మృతదేహం లభ్యమైంది. బంగారుపాళ్యం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుకు ఉపాధ్యాయుల పాలాభిషేకం



కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను ప్రకటించిన నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక మండల సచివాలయం ఆవరణలో ఆదివారం నియోజకవర్గ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆవేదనను అర్థం చేసుకొని ఒక డీఏను ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన డీఏలను విడుదల చేయడంతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, రాజేశ్వర కుమార్, శ్రీరాములు, సురేంద్ర బాబు, నారాయణ స్వామి, సురేశ్, రామచంద్ర, రామ సుబ్రహ్మణ్యం, భాస్కర్, గణపతి, తులసీదాసు, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆదివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహిస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ గత 19 రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

- ప్రభుత్వ విప్ థామస్



జీఎస్టీ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందులో వన్ నేషన్- వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ విప్, చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చెప్పారు. ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపుపై జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పన్నులను తగ్గించిందని చెప్పారు. జీఎస్టీ వల్ల జరిగే మేలును జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి దాదాపు ఏడాదికి రూ.18 నుంచి రూ.20వేల మేర ఆదా అవుతుందన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే భవనంలో ఏర్పాటు చేసిన 36 స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్ కుమార్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.

దీపావళి పండగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి



ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.

థియేటర్‌లో సీట్లకోసం.....

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది.నగరానికి చెందిన ఓ కుటుంబం సెకండ్ షోకు వచ్చింది. టికెట్ కౌంటర్ వద్ద కుటుంబంతో వచ్చాను పలానా సీట్లు కావాలని ఆ ఇంటి యజమాని కోరాడు. అందుకు సరే అన్న టికెట్లు ఇచ్చే వ్యక్తి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించమన్నాడు. తీరా డబ్బులు పంపించాక వేరే సీట్లు కేటాయిస్తానని చెప్పడంతో ఆ ప్రేక్షకుడు తన డబ్బులు వెనక్కివ్వాలని కోరాడు. దీనికి టికెట్లు ఇచ్చే వ్యక్తి ఆ టికెట్లు తీసుకోవాల్సిందేనని దురుసుగా ప్రవర్తించాడు. థియేటర్ నిర్వాహకుడు కూడా తీసుకుంటే ఆ టికెట్ తీసుకో... లేకుంటే బయటకు వెళ్లు అనడంతో ఆ ప్రేక్షకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి టికెట్ల డబ్బులు వెనక్కి ఇప్పించారు.

హాకీ, బాల్ బ్యాడ్మింటన్ విజేత ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులు హాకీ, బాల్‌బాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచారు. ఎస్వీ ఆర్ట్స్ మైదానంలో రెండు రోజులుగా మూడు అంశాలలో పోటీలు నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్‌లో సీఎన్ఆర్ డిగ్రీ కాలేజీ(పీలేరు)జట్టుపై, హాకీలో ఎస్వీయూపై ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీపై నగరి డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందింది. ముఖ్య అతిథులుగా ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.ముస్తక్‌అహ్మద్ హాజరై విజేతలకు ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు.

జలదిగ్బంధంలో గ్రామాలు..!

- కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టులు
- వర్షాకాలం వస్తే ప్రయాణానికి తిప్పలు



చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సోమల మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమల - నంజంపేట మార్గంలోని సరస్వతీపురం వద్ద జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవహించి రాత్రి 8 గంటలకు తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని గ్రామాలకు ప్రజలు ఈ మార్గంలో వెళ్లలేక పోతున్నారు. నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయి చెరువు వద్ద తాత్కాలిక కల్వర్టు వరదనీరు ముంచెత్తింది. దీంతో కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలో రాకపోకలు స్తంభించాయి. అలాగే చెన్నపట్నం చెరువు మొరవపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కొట్టుకుపోవడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ చెరువుతోపాటు ఈ మార్గంలోని గువ్వలగుట్టను సందర్శించారు. సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు చొరవ తీసుకుని గ్రామస్తులు, దాతలు విరాళాలు సేకరించి గువ్వలగుట్ట మార్గంలో తాత్కాలిక కల్వర్టును ఏర్పాటు చేశారు. వారం లోపే శనివారం రాత్రి కురిసిన వర్షాలకు చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి పెరిగి కల్వర్టుకు గండి పడి కొట్టుకు పోయింది. దీంతో గువ్వలగుట్ట మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఆవులపల్లె - పెద్దఉప్పరపల్లె మార్గంలోని సీతమ్మ చెరువు మొరవనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గార్గేయనది ఉధృతంగా ప్రవహించడంతో రెడ్డివారిపల్లె, పేటూరు, బసవపల్లె, బోనమందలకు రాకపోకలు లేక జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా గార్గేయ అలాగే నదిపై వంతెనల నిర్మాణం నోచుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలం వస్తే ప్రయాణాలు గగనంగా మారుతున్నాయి. పెద్దఉప్పరపల్లె వద్ద గార్గేయనది ప్రవహించడంతో అటు వైపున ఉన్న రెడ్డివారిపల్లె, బోనమంద, దుర్గంకొండ ఆలయానికి, పేటూరు, బసవపల్లె, చిన్నకమ్మపల్లె, చిన్నతోపు, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతలపల్లె గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వచ్చి నిత్యావసర వస్తువులు తెచ్చు కోలేక పోతున్నారు. వైద్య సేవలు పొందలేక పోతున్నారు. భారీ వర్షాలతో తాత్కాలిక కల్వర్టు కొట్టుకు పోయి 7 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ప్రజలు వరదనీటిలో ప్రయాణం చేయక తప్పడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు సమస్యను మొరపెట్టుకున్నా స్పందన కరవైంది. ఇప్పటికైనా వంతెనలు నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.



జీడిరేవుల వంకపై కొట్టుకుపోయిన కల్వర్టు, వంక ఉధృతిని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్



చెన్నపట్నం చెరువు మొరవపై కల్వర్టుకు గండి



నంజంపేట-పొదలగుంట్లపల్లె మార్గంలో గండిపడ్డ దళవాయి చెరువు

జూపల్లిలో గజరాజుల దాడులు

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి శనివారం రాత్రి బయలుదేరిన 7 ఏనుగుల గుంపు అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శివయ్య, రఘు, జయపాల్, మునస్వామి, మోహన్, సుబ్బరత్నకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు పూర్తిగా విరిచేశాయి. కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. టపాకాయలు శబ్దాలు వినడంతో ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాలకు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.



మామిడిచెట్టు కొమ్మలను పూర్తిగా విరిచేసిన ఏనుగులు (వృత్తంలో)

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళి

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కార్యదర్శిగా షణ్ముగం, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతానం, అడిషనల్ కార్యదర్శిగా వినాయక, కన్వీనర్‌గా బాబు, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, ప్రసాద్, రమేష్, నవీన్, నరేష్, సుబ్బలక్ష్మి, ప్రణీత, రజిని, కవిత, సురేఖ, మాధవ ప్రసాద్, రఘుపతి, గుణశేఖర్, షణ్ముగం, అన్బురాజ్, సిద్దయ్య, కృష్ణప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దేవరాజులు, మహేష్, కుమార్, ప్రవీణ్, చిరంజీవి, ప్రగతి, ప్రతిభ, చెన్నకేశవులు, కృష్ణయ్య, వెంకటరమణ, రెడ్డప్ప, చిన్నయ్య, చెంగయ్య, పురుషోత్తం, రమ్య, సులోచన, లోకనాథన్, సురేష్, చిన్నప్ప, మురగయ్య, గుణశేఖర్, రాజేష్, మొగిలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం

అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

- కారును తప్పించబోయి బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్





డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు, బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో సంక్రాంతిపల్లె వద్ద ఆదివారం కారును తప్పించబోయిన డీజిల్ ట్యాంకర్ బోల్తాకొట్టింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు సంక్రాంతిపల్లె వద్దకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. అదే సమయంలో చిత్తూరు జిల్లా యాదమరి నుంచి డీజిల్ లోడుతో పలమనేరు వైపు వెళుతున్న ట్యాంకరు వైపు కారు దూసుకొచ్చింది. దీంతో డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ ఆ కారును తప్పించబోగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలారు పరవళ్లు..!

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా శాంతిపురం పట్టణానికి ఆనుకుని ప్రవహించే పాలారు నది పరవళ్లు తొక్కుతోంది. కర్ణాటక రాష్ట్రంలో కొనసాగుతున్న భారీ వర్షాలతో రాష్ట్ర సరిహద్దుల్లోని చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఈ వరదనీరు గురువారం ఉదయం రామకుప్పం మండలం కొళ్ళపల్లె వద్ద ప్రారంభమయ్యే పాలారు నదికి చేరుకున్నాయి. మూడు రోజుల పాటు ప్రవహించిన జలాలు శనివారం రాత్రి శాంతిపురం పట్టణానికి చేరువలోని పాలారు చెక్‌డ్యాంకు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున చెక్‌డ్యాం నిండి జలాలు కిందికి హోరు శబ్దం చేస్తూ జాలువారుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత పాలారు పరవళ్లు నియోజకవర్గ రైతుల్లో సంతోషం నింపుతోంది. కుప్పం నియోజకవర్గంలో సుమారు 38 కిలోమీటర్లు ప్రవహించే పాలారు నదీ జలాలు తమిళనాడుకు చేరుకుంటాయి. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో సుమారు నాలుగేళ్లుగా వర్షాలు నామమాత్రంగా కురవడంతో భూగర్భజలాలు తగ్గిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. పాలారు నది ఒకసారి ప్రవహిస్తే ఈ ప్రాంతంలో రెండేళ్లపాటు భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



శాంతిపురం వద్ద నిండుజలాలతో పాలారు చెక్‌డ్యాం



పాలారు చెక్‌డ్యాం నుంచి జలప్రవాహం

మా భూమి కాజేశారు


- రికార్డులు తారుమారు చేసిన తహసీల్దార్
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



భూముల రికార్డులను చూపుతున్న బాధితులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రికార్డులు తారుమారు చేసి కాజేసిన మా భూమిని ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు అనసూయమ్మ, పాండురంగయ్య కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పిట్టలవారి సందుకు చెందిన తాము బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామంలో సర్వే నంబరు 79/3లో ఐదు ఎకరాల భూమిని 2011లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమి 2012లో తమ అనుభవంలోకి రాగా 2019లో పాసుపుస్తకాలు కూడా మంజూరైనట్లు చెప్పారు. పంటల సాగు నిమిత్తం శ్రీకాళహస్తి ఇండియన్ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా పల్లమాల గ్రామానికి చెందిన శేఖర్ భూమి తమదంటూ వివాదానికి దిగడంతో కేసులు కూడా అయ్యాయని వివరించారు. కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ పేరుతోనున్న భూములు 10వ తేదీకి రవీంద్రబాబు పేరుమీదకు మారిపోయాయని తెలిపారు. ఇది తహసీల్దారు చేసిన కుట్ర అని ఆరోపించారు. ఈ విషయమై అడిగితే సరైన సమాధానం ఇవ్వకపోగా హైకోర్టు ఆదేశాలతో రికార్డులు మార్చినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 17వ తేదీన బీఎన్‌కండ్రిగ తహసీల్దారు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో తమపై కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి, విచారణ జరిపి రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని తమ భూమి ఇప్పించి న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని స్పష్టం చేశారు.

ఐఏఎస్‌వో జాతీయ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్ర



నియామక పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ నరేంద్ర

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర ఐఏఎస్‌వో (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ) జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గోవాలో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ 38వ జాతీయ సదస్సులో జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, పలువురు వైద్యాధికారులు ఆయన్ను అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ రూపాయి ప్లాన్

30 రోజులు ఉపయోగించుకోవచ్చు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు రూపాయి ప్లాన్ విడుదల చేసింది. రూపాయి సిమ్ కొనుగోలు చేసి యాక్టివేషన్ చేసుకుంటే 30 రోజులు 4జీ మొబైల్ సేవలను ఉచితంగా అందిస్తుందని డీజీఎం వెంకోబరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి రోజు నుంచి నవంబరు 18వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అపరిమితంగా వాయిస్‌కాల్స్ చేసుకునే అవకాశముందని తెలిపారు. రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రైళ్లలో తగ్గని రద్దీ

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి ప్రత్యేక రైళ్లు వేసినా రద్దీ తగ్గడం లేదు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. అయినప్పటికీ తిరుపతి నుంచి బయలుదేరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెయిటింగ్ లిస్ట్‌తో నడుస్తున్నాయి. రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి మరికొన్ని నడిపితే రద్దీ తగ్గే అవకాశముంది.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తప్పిపోయిన ఓ చిన్నారిని మహిళా పోలీసులు ఆదివారం తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం సాయంత్రం తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయం వద్ద ఉండగా ఐదారు నెలల చిన్నారి ఏడుస్తూ కనిపించింది. చుట్టుపక్కల విచారించినా ఎవరూ లేరు. దీంతో ఆ బిడ్డను ఇంటికి తీసుకెళ్లి రాత్రంతా సంరక్షించా'నంటూ ఆదివారం ఉదయం బిడ్డ సహా ఒకామె మహిళా పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఆమెతో పాటు బిడ్డను తీసుకుని ఈస్ట్ పోలీసు స్టేషన్లో విచారించగా బిడ్డ తప్పిపోయినట్లు ఫిర్యాదు రాలేదని చెప్పారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో శక్తి టీమ్ సభ్యులు విచారణ జరిపి, బిడ్డ తల్లితండ్రుల వివరాలు సేకరించారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి బిడ్డను అప్పగించారు. మహిళా పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.